


మునిసిపాలిటీ దిశగా అశ్వారావుపేట

పురపాలక పట్టణశాఖ కార్యాలయ ఆమోదం లాంఛనమే

నియోజకవర్గ కేంద్రం, పూర్వపు బ్లాక్

కేంద్రం కావడం అనుకూల అంశాలు

అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు

పంచాయతీల విలీనానికి ప్రతిపాదనలు

7

లంచగొండుల
ఆటకట్టు

- ఏసీబీ వలలో కొత్తగూడెం మెడికల్ కళాశాల ఏవో, జూనియర్ అసిస్టెంట్
- అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీకి లంచం వేధింపులు
- ఏసీబీ అధికారులను ఆశ్రయించిన బాధితులు
- రూ.3 లక్షలు తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు




లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ కొత్తగూడెం మెడికల్ కళాశాల ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్

కొత్తగూడెం పోస్టాఫీస్‌సెంటర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు చెల్లించేందుకు లంచం డిమాండ్ చేసి ఏసీబీకి దొరికిపోయారు ఇద్దరు ఉద్యోగులు. లక్షల్లో జీతాలు పొందుతున్నా.. అవి చాలవన్నట్టు అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతాలపై కన్నేశారు. చివరకు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ఫిర్యాదుతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు వారి ఆటకట్టించారు. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో మంగళవారం చోటుచేసుకుంది. కొత్తగూడెం ప్రభుత్వ మెడికల్ కళాశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(ఏవో) ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్ రూ.3లక్షల లంచం తీసుకుంటూ మంగళవారం ఏసీబీ అధికారులకు చిక్కారు. వివరాల్లోకి వెళ్లితే..

ఏసీబీ డీఎస్పీ వై.రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగూడెం మెడికల్ కళాశాలలో అవుట్‌సోర్సింగ్ ఉద్యోగాలను ఓ ఏజెన్సీ ద్వారా భర్తీ చేశారు. అయితే 49 మంది ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో సదరు ఏజెన్సీ యాజమాన్యం వారు మెడికల్ కళాశాలను, జిల్లా ఉన్నత అధికారులను సంప్రదించారు. దీంతో మెడికల్ కళాశాల ఏవో రెండున్నర నెలల జీతాల బిల్లులను మంజూరు చేశారు. అయితే సంబంధిత విభాగాల్లో పని చేసేందుకు సరైన ధ్రువపత్రాలు లేవని 23మందిని మెడికల్ కళాశాల వారిని తొలగించింది.

పని చేసిన కాలానికి జీతాలు చెల్లించకపోగా వారిని తొలగించడాన్ని వ్యతిరేకించిన అవుట్‌సోర్సింగ్ ఏజెన్సీ పూర్తి జీతాలు చెల్లించాలని మెడికల్ కళాశాల అధికారులను కోరారు. దీంతో 49మందికి (మిగతా 6వ పేజీలో)

తెల్ల బంగారు 'శోకం'



దూదిపూల దుఃఖం

మార్కెట్‌లో రోజు రోజుకూ పడిపోతున్న పత్తి ధరలు

- రెండేళ్ల క్రితం అత్యధికంగా క్వింటాలు రూ.13,050
- ఈ ఏడాది రూ.6వేల లోపే..
- మార్కెట్‌లో ధర లేక పంటను తిరిగి తీసుకెళ్తున్న రైతులు
- సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో 'తేమ' పేరిట కొర్రీలు
- ఆందోళనలో పత్తి రైతులు

ఖమ్మం మార్కెట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూలిగే నక్కపై తాటి పండు పడినట్లుంది పత్తి రైతుల పరిస్థితి. సాగు సమయంలో అతివృష్టి, అనావృష్టి వంటి ప్రకృతి విపత్తులతో సతమతమైన రైతులు ఆరుగాలం కష్టించి, అప్పులు చేసి పండించిన పంటకు మార్కెట్‌లో గిట్టుబాటు దక్కకపోవడంతో అరిగోస పడుతున్నారు. ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు సైతం వచ్చే పరిస్థితిలేదని ఆవేదన చెందుతున్నారు. పత్తి ధరలు అమాంతం పడిపోవడంతో పత్తి రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఖమ్మం మార్కెట్‌కు మంగళవారం సుమారు 25వేల బస్తాల పత్తి అమ్మకానికి రాగా క్వింటా గరిష్ఠంగా రూ.6,800 ఆన్‌లైన్ బిడ్డింగ్ ధరకు కేవలం 2వేల బస్తాలు మాత్రమే కొనుగోలు చేశారు. మిగిలిన 23వేల బస్తాలను పంటను నాణ్యత లేమి, తేమ శాతం కొర్రీలతో కేవలం రూ.4,000నుంచి రూ.5,000వరకు మాత్రమే కొనుగోలు చేయడంతో పెట్టుబడి ఖర్చులు కూడా రావని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తేమ, తరుగు కొర్రీలు

జిల్లాలో ఏర్పాటు చేసిన సీసీఐ కొనుగోలు కేంద్రాల్లోనూ రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. జిల్లా వ్యాప్తంగా 9 సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినా పూర్తిస్థాయిలో అన్ని కేంద్రాల్లో కొనుగోళ్లు జరగడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వాతావరణ పరిస్థితుల కారణంగా పత్తిలో తేమశాతం ఎక్కువగా ఉండటంతో కొనుగోలుకు అడ్డంకిగా మారిందని, 8నుంచి 12శాతం తేమ ఉంటేనే పాస్ చేస్తుండటంతో తక్కువ మొత్తంలో పంట కొనుగోలు చేస్తున్నారు. అంతే కాకుండా సీసీఐ కేంద్రాలకు పత్తిని తీసుకువచ్చే (మిగతా 6వ పేజీలో)

రెండేళ్ల క్రితం రూ.13,050

అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్ ఉండటంతో 2022 మే 14న ఖమ్మం మార్కెట్‌లో అత్యధికంగా క్వింటాలు పత్తిని వ్యాపారులు రూ.13,050రికార్డు ధరలకు కొనుగోలు చేశారు. ఆ తరువాత రెండేళ్ల నుంచి పత్తికి జాతీయ, అంతర్జాతీయంగా డిమాండ్ పెద్దగా లేకపోవడంతో క్వింటాలు రూ.6,000 నుంచి రూ.7,000 వరకు మాత్రమే కొనుగోలు చేస్తున్నారు. కాగా పత్తికి ఈ ఏడాది కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాలుకు రూ.7,521 సైతం మార్కెట్‌లో దక్కడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం లభించే ధరలతో గిట్టుబాటు కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రసుతం వానాకాలం సీజన్ పంటలు సాగులో ఉండటంతో ఆయా పంటల పెట్టుబడి ఖర్చుల కోసం పత్తిని తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని వాపోతున్నారు.

ముఖాముఖి



విద్యుత్ చార్జీలు పెరగవు

ఎ.సురేందర్, ఎస్ఈ, ఎన్‌పీడీసీఎల్, ఖమ్మం

ప్రశ్న: జిల్లాలో విద్యుత్ వినియోగం ఎలా ఉంది ?

జవాబు: జిల్లాలో రోజుకు 65 లక్షల విద్యుత్ వినియోగం అవుతోంది. 24గంటల నిరంతర విద్యుత్ సరఫరాకు ఎటువంటి ఇబ్బంది లేదు.

ప్ర: విద్యుత్ చార్జీలు పెంచే అవకాశాలు ఉన్నాయా?

జ: విద్యుత్ చార్జీలు పెంచే విషయంపై ఈఆర్సీ నుంచి ఎటువంటి ప్రతిపాదనలు జిల్లాకు రాలేదు. విద్యుత్ చార్జీలు ఇప్పట్లో పెంచే కార్యాచరణ లేదు.

ప్ర: తరుచూ జరిగే విద్యుత్ ప్రమాదాలపై ఎలాంటి చర్యలు చేపడుతున్నారు?

జ: గతంలో కంటే జిల్లాలో విద్యుత్ ప్రమాదాల సంఖ్య తగ్గింది. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే వెంటనే విచారణ చేసి శాఖా పరంగా లోపాలుంటే వెంటనే చర్యలు తీసుకుంటున్నాం. చింతకాని మండలం పొద్దుటూరులో జరిగిన ప్రమాదంలో విద్యుత్ ఉద్యోగులపై చర్యలు తీసుకోవటం జరిగింది.

ప్ర: ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతుల సమయంలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కదా..?

జ: రైతుల వ్యవసాయ భూమిలో సింగిల్ ఫేజ్, త్రిఫుల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు జరిగితే రైతులకు పైసా వ్యయం కాకుండా విద్యుత్‌శాఖ ట్రాన్స్‌పోర్టు చేసి ఉచితంగా ట్రాన్స్‌ఫార్మర్‌లను నిర్మాణం చేస్తాం.

ప్ర: 'పొలంబాట' కార్యక్రమం ఎలా జరుగుతోంది ?

జ: రైతుల వద్దకే విద్యుత్‌శాఖ నినాదంతో పొలంబాట్ కార్యక్రమం పక్షం రోజుల క్రితం ప్రారంభించాం. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్‌లపై రైతుల నుంచి ఫిర్యాదులు రాకుండానే శాఖా పరంగా పరిశీలన చేసి వంగిపోయిన విద్యుత్ స్తంభాలను సరిచేశాం. అవసరమైన చోట అధిక లోడ్ ఉన్న ప్రాంతల్లో అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశాం.

ప్ర: విద్యుత్ సమస్యలపై ఎవరికి ఫిర్యాదు చేయాలి?

జ: రాష్ట్రస్థాయిలో 1912 నెంబర్‌కు, జిల్లా స్థాయిలో 94408 11525 నెంబర్‌కు కాల్ చేయవచ్చు. నివాసాల్లో విద్యుత్ పోతే 94408 11525కు కాల్ చేయాలి.

-ఆంధ్రజ్యోతి, ఖమ్మం సంక్షేమ విభాగం



కొత్త డీఎంహెచ్‌వోగా
కళావతిబాయి

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారిగా డాక్టర్ కళావతిబాయిని నియమిస్తూ మంగళవారం ప్రభుత్వ సెక్రటరీ డాక్టర్ క్రిష్టియానా ఉత్తర్వులను జారీ చేశారు. ఇప్పటివరకు డాక్టర్ వి.సుబ్బారావు డీఎంహెచ్‌వోగా పూర్తి అదనపు బాధ్యతలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో కళావతిబాయిని రెగ్యులర్ డీఎంహెచ్‌వోగా నియమిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. రాష్ట్ర వ్యాప్తంగా 13జిల్లాలకు డీఎంహెచ్‌వోల నియామకాన్ని చేపట్టారు. వీటిలో ఖమ్మానికి కళావతిబాయిని నియమించారు. ఆమె ప్రస్తుతం ప్రభుత్వ మెడికల్ కళాశాలకు అనుసంధానంగా ఉన్న జిల్లా ఆస్పత్రి ఆర్‌ఎంవోగా విధులు నిర్వహిస్తున్నారు.

రేపటి నుంచి మార్కెట్‌కు
'దీపావళి' సెలవులు

ఖమ్మంమార్కెట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌కు ఈనెల 31నుంచి నవంబరు 3వరకు వరుసగా నాలుగురోజులు సెలవులు ఉన్నట్లు మార్కెట్ సెక్రెటరీ ప్రవీణ్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. 31న (గురువారం) దీపావళి పండుగ సందర్భంగా, నవంబరు 1న శుక్రవారం అమావాస్య కారణంగా సెలవు, 2, 3 తేదీలు శని, ఆదివారాలు వారాంతం సందర్భంగా సెలవులు ఉన్నట్లు ఆయన తెలిపారు. కాగా మార్కెట్‌లో తిరిగి నవంబరు 4 నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా ఉంటాయని తెలిపారు.

6నుంచి ఇంటింటి సర్వే

ఖమ్మం సంక్షేమవిభాగం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇక సమగ్ర ఇంటింటి సర్వేకు శ్రీకారం జరగనుంది. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కుల సర్వే చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వటంతో తొలి అడుగుపడింది. ఈ మేరకు ఖమ్మం నగర పాలక సంస్థలో సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేకు కసరత్తు పూర్తి చేశారు. అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లాతో పాటుగా రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, కలెక్టరేట్ సిబ్బంది కలిసి 24 బృందాలకు కేఎంసీలో సమగ్ర సర్వేపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. నవంబరు 6నుంచి ఇంటింటి సర్వే జరగనుంది.



దీపావళి అంటే ముందుగా గుర్తొచ్చేది టపాసుల మోత. రకరకాల క్రాకర్స్‌ను పేలుస్తూ పిల్లలు, యువకులు తెగ ఎంజాయ్ చేస్తారు. ప్రతీ ఏడాది వలెనే ఈ సారి కూడా నగరంలోని ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్నార్ కళాశాల ఆవరణలో క్రాకర్స్ స్టాల్స్‌ను ఏర్పాటుచేశారు. దీపావళికి ఒక్కరోజే వ్యవధి ఉండటంతో ఇక్కడ క్రాకర్స్ కొనుగోళ్లు ఊపందుకున్నాయి. కాకర ఒత్తులు, మతాబులు, చిచ్చుబుడ్లు, భూచక్రాలు, విష్ణు చక్రాలు, రాకెట్లు.. ఇలా ఒకటేమిటి ఎన్నెన్నో వెరైటీలు జోరుగా అమ్ముడవుతున్నాయి. గతేడాది కంటే ధరలు పేలుతున్నా.. పండుగ ఉత్సాహం ముందు వాటిని లెక్కచేయడం లేదు. దటీజ్ దీపావళి మరి.

రోడ్డు ఆక్రమణలపై కొరడా

నగరంలో ప్రహరీలు, డబ్బా కొట్లు, టీ, టిఫిన్ బండ్ల తొలగింపు



ఖమ్మం సంక్షేమవిభాగం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగర జనాభాకు, వాహనాలకు తగిన విధంగా రహదారుల విస్తరణ జరుగుతున్నా.. ఆక్రమణలు కూడా అదేస్థాయిలో జరుగుతున్నాయి. పెద్ద వ్యాపారులు సైతం గతంలో ఎన్నడూ లేని విధంగా వారి షాపుల ఎదుట రహదారులను ఆక్రమిస్తున్నారు. ఇక చిరు వ్యాపారులు సంగతి చెప్పాల్సిన పనేలేదు. దీంతో ఖమ్మం నగర పాలక సంస్థ కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు గత మూడు రోజులుగా ఖమ్మం నగరంలో పట్టణ ప్రణాళిక అధికారులు స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. గట్టయ్య సెంటర్ నుంచి టీడీపీ కార్యాలయం సెంటర్ వరకు రహదారికి అడ్డుగా ఉన్న వ్యాపారాలను తొలగించారు. మంగళవారం 11వ డివిజన్ కవిరాజ్‌నగర్‌లోనూ అక్రమంగా నిర్మాణం జరుగుతున్న షాపింగ్ మాల్ ప్రహరీని, షట్టర్లను తొలగించారు. 43వ డివిజన్‌లో ప్రశాంతి హాస్పటల్ నుంచి జేఆర్ ప్రసాద్ హాస్పటల్ వరకు రోడ్డు మీద ఉన్న ఐరన్ దుకాణాలను, బోర్డులను తొలగించారు. రహదారుల ఆక్రమణలకు గురైన ప్రాంతంలో ఆక్రమణదారులకు సహకరించిన స్థలాల యజమానులపై కేసులు నమోదు చేస్తామని ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

ప్రతిష్టాత్మకంగా
ఇందిర డెయిరీ

- భవిష్యత్తులో దేశం మొత్తం మధిర వైపు చూస్తుంది..
- పాలు, డెయిరీ ఉత్పత్తుల ద్వారా రూ.600 కోట్లు ఆదాయం
- ఇప్పటికే 61వేల మంది మహిళలు సభ్యులుగా చేరిక
- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- మధిరలో 'ఇందిర డెయిరీ' లోగో ఆవిష్కరణ



మధిరలో ఇందిర డెయిరీ లోగోను ఆవిష్కరిస్తున్న భట్టి విక్రమార్క

మధిర టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశం మొత్తం మధిర వైపు చూసేలా ఇందిర డెయిరీ రూపుదిద్దుకోనుందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మధిరలోని రెడ్డి గార్డెన్స్‌లో మంగళవారం ఇందిర డెయిరీ లోగో ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలో సహకార సంఘం ద్వారా నడిచే మొదటి మహిళా డెయిరీగా ఇందిర డెయిరీ నిలువనుందని అన్నారు. 2013లో ఏర్పాటు చేసిన ఈ డెయిరీని గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం మూలన పడేసిందని తెలిపారు. ఆనాడే డెయిరీ ఏర్పాటుకు బోనకల్‌లో తొమ్మిదిన్నర ఎకరాల సలం కేటాయించడమే కాకుండా నాలుగున్నర వేల మంది మహిళలు ఒక్కొక్కరు రూ. 500 చెల్లించారని తెలిపారు. వారు చెల్లించిన సభ్యత్వ రుసుము నేడు వడ్డీతో (మిగతా 6వ పేజీలో)

రైతు సంక్షేమమే
ప్రభుత్వ సంకల్పం

- ప్రతీ పంటను కొనుగోలు చేసి మద్దతు ధర కల్పిస్తాం
- రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



బీరోలులో పెద్దచెరువు పనులు ప్రారంభిస్తున్న మంత్రి పొంగులేటి

తిరుమలాయపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దేశానికి పట్టెడు అన్నం పెట్టే రైతుసంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేసి వారిని అన్ని విధాల ఆదుకుంటుందని ఆరుగాలం పండించిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పిస్తున్నట్టు రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వివిధ గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా బీరోలులో రూ.3కోట్లతో చేపట్టిన పెద్దచెరువు ఆధునీకరణ పనులను ఆయన పరిశీలించారు. అలాగే పాతర్లపాడు సమీపంలో భాగ్యలక్ష్మి జిన్నింగ్‌మిల్లులో పత్తి కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు.

అనంతరం తిరుమలాయపాలెం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థినులకు పీఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా సైకిళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రైతులు పండించిన వరిధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, అందుకు అవసరమైన (మిగతా 6వ పేజీలో)



దివ్వెల పండుగకు వేళాయే

- రేపే దీపావళి పర్వదినం
- ఇంటింటా నోముల సందడి
- మార్మోగనున్న టపాసుల మోతలు

ఖమ్మం సాంస్కృతికం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అశ్వీయుజ బహుళ చతుర్థశినే నరక చతుర్థశి అని పిలుస్తారు. నరక చతుర్థశి తరువాతి రోజును దీపావళిగా పండుగ జరుపుతారు. తెలుగుపండుగల్లో దీపావళి అత్యంత ప్రముఖమైనది, ఆదరణ పొందేది. పండుగతోపాటు బాణసంచా ముడిపడి ఉండటంతో ఈ పండుగకు అంతటి విశిష్టత ఏర్పడింది. బాణసంచా కాల్చటం పిల్లలనుంచి పెద్దలకూ వినోదం కనుక దీపావళిని మతాలకు అతీతంగా అందరూ ఆనందిస్తారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా జరుపుకొనే పండుగ దీపావళి. పురాణ గాథ ప్రకారం నరకాసురుడు అనే రాక్షసుడు ప్రజలను పీడిస్తుండటం, దేవతలను అవమానిస్తుండటంతో ఆ బాధలను తట్టుకోలేక అందరూ కృష్ణుడిని శరణువేడటంతో శ్రీకృష్ణుడు సత్యభామతో కలిసి నరకాసురుడితో యుద్ధం చేసి అతడిని సంహరించిన సందర్భంగా పండుగ జరుపుకోవటంతో దీపావళి ప్రారంభమయిందని చెబుతారు.

గతేడాది కన్నా పెరిగిన ధరలు

దీపావళి పండుగ అంటే దీపాల వరుస మాత్రమే కాదు.. పటాసుల మోత కూడా.. బాంబులు, కాకరొత్తులు, చిచ్చుబుడ్లు, మతాబులు, తారాజువ్వలు, భూ చక్రాలు, తదితర సరంజామాతో దీపావళికి నిండుదనం చేకూరుతుంది. బాణసంచా కాల్చటం పర్యావరణ పరంగా, ఆరోగ్యాలపరంగా నిషేధమే అయినా ఉల్లాసాన్ని, ఉత్సాహన్ని ఇచ్చే దీపావళి జోష్ బాణసంచాతోనే.. అందుకే చిన్నా పెద్దా టపాసులకే జై అంటారు.. బాణసంచాతోనే దీపావళి పండుగకు నిండుదనం వస్తుందని భావిస్తారు. బడ్జెట్ పరంగా భారమే అయినా అంతో ఇంతో బాణసంచా కాల్చందే తృప్తి ఉండదు.. అందుకే నగరంలోని ఎస్‌ఆర్ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాల వద్ద జనం రద్దీ ఏర్పడింది. బాణసంచా కొనుగోలు చేసేందుకు పెద్దఎత్తున తరలి వస్తుండటంతో మైదానం కళకళలాడుతోంది. బాణసంచాతోపాటు దీపావళికి అవసరమైన ఇతర సామగ్రి విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. ఈ ఏడాది సంభవించిన అధిక వర్షాలు, వరదలు బాణసంచా తయారీ పరిశ్రమపై ప్రభావం చూపటం ధరల పెరుగుదలకు కారణమని దుకాణ దారులు చెబుతున్నారు.



గురువారమే పండుగ..

తిథిద్వయం కారణంగా ఈ ఏడాది పండుగలో కొంత గందరగోళం ఏర్పడటంతో పండుగను ఎప్పుడు జరుపుకోవాలనే విషయంపై పండితులు స్పష్టత నిస్తున్నారు. తెలుగు పంచాంగం ప్రకారం అశ్వయుజ బహుళ చతుర్థశి తిథి అక్టోబరు 30వతేదీన మధ్యాహ్నం 1.15కు మొదలై అక్టోబరు 31న మధ్యాహ్నం 3. 52కు ముగుస్తుంది. సాధారణంగా పండుగలను సూర్యోదయ తిథి ఆధారంగా జరుపుకొంటారు కనుక నరక చతుర్థశిని అక్టోబరు 31వ తేదీన జరుపుకోవాలని సూచిస్తున్నారు. దీపావళి పండుగనాడు లక్ష్మీదేవి పూజ, కేదార వ్రతం తప్పక ఆచరిస్తారు. దీపావళి రోజున దీపం వెలిగించటం వల్ల చెడు దూరమై సుఖశాంతులు కలుగుతాయని భావిస్తారు.



ఖమ్మం ఎస్‌ఆర్‌ అండ్‌బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన బాణసంచా దుకాణాలు

రక్తదానం... ప్రాణదానమే...

- యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి
- యువత ఆరోగ్యమే.. సమాజ ఆరోగ్యం
- ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్‌దత్



మాట్లాడుతున్న సీపీ సునీల్‌దత్

నేలకొండపల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):రక్తదానం మహాదానమని, రక్తదానం చేయటమంటే ప్రాణదానం చేయటమేనని ఖమ్మం కమిషనర్ ఆఫ్ పోలీస్ సునీల్‌దత్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఖమ్మం రూరల్ సబ్ డివిజన్ పోలీసుల ఆధ్వర్యంలో నేలకొండపల్లి మార్కెట్ యార్డు ఆవరణలో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని సీపీ ప్రారంభించారు. రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో సీపీ మాట్లాడుతూ ఆపదలో ఉన్న రోగులకు రక్తం అవసరమైన సమయంలో వైద్యులు అందుబాటులో ఉన్నా.. రక్తం అందుబాటులో లేకపోతే ప్రయోజనం ఉండదన్నారు. అందుకే రక్తదానం చేసిన వారే ప్రాణదాతలని ఆయన అన్నారు. అదే సమయంలో రక్తదానం చేయాలంటే యువత ఆరోగ్యంగా, ధృడంగా ఉండాలన్నారు. యువత మత్తు పదార్థాలకు, వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్‌ను సమాజం నుంచి పారద్రోలాలని, ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించుకుందామని, అందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సీపీ కోరారు. పోలీస్ అమరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఇంత పెద్ద ఎత్తున రక్తదాన శిబిరాన్ని నిర్వహించిన రూరల్ సబ్-డివిజన్ పోలీసులను సీపీ అభినందించారు. రక్తదాన శిబిరం ద్వారా సేకరించిన రక్తాన్ని తలసేమియాతో బాధపడుతున్న చిన్నారులకు ఉపయోగించనున్నట్లు సీపీ చెప్పారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(లాఅండ్‌ఆర్డర్)ప్రసాదరావు,రూరల్ ఏసీపీ తిరుపతిరెడ్డి, కూసుమంచి, ముదిగొండ సీఐలు సంజీవ్, మురళి, నేలకొండపల్లి, కూసుమంచి ఎస్ఐలు పెంటరి సంతోష్, నాగరాజు, రూరల్ సబ్‌డివిజన్ పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మెగారక్తదాన శిబిరం విజయవంతం

ఖమ్మం రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో పోలీస్ అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా మంగళవారం నేలకొండపల్లి మార్కెట్ యార్డులో నిర్వహించిన మెగా రక్తదాన శిబిరం పూర్తి విజయవంతమైంది. మొత్తం 735 మంది వివిధ వర్గాలకు చెందిన వారు స్వచ్ఛందంగా పాల్గొని రక్తదానం చేశారు. నేలకొండపల్లి ఎస్ఐ సంతోష్ మాట్లాడుతూ రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ పేరు పేరునా ధన్యవాదాలు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని
కలెక్టరేట్‌లో ఏఈవోల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న ఏఈవోలు

కొత్తగూడెంఅర్బన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ విస్తరణ అధికారుల సమస్యల సాధన కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న క్రమంలో.. రాష్ట్రంలో 80మంది ఏఈవోలపై విధించిన ఉత్తర్వులు తక్షణమే నిలిపివేయాలని ఏఈవో జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రైతునేస్తం ప్రోగ్రాం వీడియో కాన్ఫరెన్సులో నిరసన వ్యక్తం చేశారు. అధికారుల తీరుపట్ల నల్ల బ్యాడ్జీలు ధరించి నేలపై కూర్చొని తమ ఆవేదన వ్యక్తం చేశారు. కలెక్టరేట్‌లోని డీఏవో కార్యాలయంలో విత్తన కొనుగోలు కేంద్రాలు ఏర్పాటుపై జరిగిన అవగాహన సదస్సుకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఈవోల జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు చర్చల్లో ఏఈవోలకు ఇచ్చిన హామీలను నేరవేర్చకుండా సస్పెండ్ చేయడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సింహరావు, లక్ష్మణ్‌రావు, సందీప్, నవ్య, అనూష, రమేష్, ప్రవీణ్, రవీందర్‌రావు, శరత్, పవన్, మనోహర్, సరిత, సాహిత్య, కీర్తి, లత, ప్రన్యూష, విజయభాను, మమత, సత్యం, ప్రశాంత్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన
అదనపు కలెక్టర్

కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీనివాసరెడ్డి



కలెక్టర్‌ను కలిసి పూలమొక్కను అందిస్తున్న అదనపు కలెక్టర్

ఖమ్మం కలెక్టరేట్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా పి శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన ఉదయం 9గంటలకే కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయన తన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఆ తర్వాత ఆయన కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ జేసీని అభినందించారు. కలెక్టర్‌ను డీఎస్వో చందన్‌కుమార్, కలెక్టరేట్ ఏవో అరుణ, కారుమంచి శ్రీనివాసరావు, వివిధ విభాగాల పర్యవేక్షకులు కలిసి పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. అనంతరం అదనపు కలెక్టర్ పాలేరులో నిర్వహించిన మంత్రి కార్యక్రమంలో పాల్గొన్నారు.

జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు దక్కటమే లక్ష్యం

ఖమ్మంటౌన్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నియోజకవర్గంలో అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్లస్థలాలు దక్కటమే ఏకైక లక్ష్యమని మూడు వర్కింగ్ జర్నలిస్టు యూనియన్ల నేతలు పేర్కొన్నారు. మంగళవారం నగరంలోని టీఎన్‌జీవో కార్యాలయంలో సంయుక్త సమావేశం నిర్వహించారు. సుదీర్ఘచర్చల అనంతరం జర్నలిస్టులకు సత్వరమే ఇళ్లస్థలాలు దక్కేందుకు స్తంభాద్రి హౌజింగ్ సొసైటీతో కలిసి కార్యాచరణలోకి దిగాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు. మూడు యూనియన్లతో ఏర్పాటైన సమన్వయ కమిటీ సలహాలను, సూచనలను సొసైటీ గౌరవించాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ సమావేశంలో టీయూడబ్ల్యుజే-ఐజేయూ, టీయూడబ్ల్యుజే-టీజేఎఫ్ టీడబ్ల్యుజేఎఫ్ బాధ్యులు, నాయకులు పాల్గొన్నారు.

దూదిపూల దుఃఖం

(5వ పేజీ తరువాయి)

వాహనాన్ని బట్టి ఒక క్వింటా నుంచి 50 కేజీల వరకు తరుగు తీస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ప్రైవేటు వ్యాపారులను ఆశ్రయించి తమ పంటను తక్కువ ధరలకు అమ్ముకోవాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు.

పంట మళ్లీ ఇంటికే..

మార్కెట్‌లో పత్తికి వ్యాపారులు ధర తగ్గించడంతో రైతులు గిట్టుబాటు కాక తిరిగి తమ పంటను ఇళ్లకు తీసుకెళ్తున్నారు. మరి కొంత మంది రైతులు మాత్రం రెండు, మూడు రోజులు మార్కెట్‌లోనే పంటను ఉంచి మంచి ధర వచ్చే వరకు వేచి చూస్తున్నారు. అయినా గిట్టుబాటు ధర దక్కకపోవడంతో తక్కువ ధరలకు అమ్ముకుని ఉసూరుమంటూ తమ ఇళ్లకు వెళుతున్నారు.

పెట్టుబడి ఖర్చులు కూడా రావట్లేదు...

పి. గోవిందరావు, అనంతారం, కొణిజర్ల మండలం



ఐదు ఎకరాల్లో పత్తి సాగు చేశా. వర్షాలతో దిగుబడి బాగా తగ్గింది. ఎకరానికి కేవలం 4 నుంచి 5 క్వింటాలు మాత్రమే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో పంట అమ్ముకానికి తీసుకొస్తే క్వింటాలుకు కేవలం రూ.4,000 నుంచి రూ.4,500 వరకు మాత్రమే వ్యాపారులు ధర పెడుతున్నారు. కూలీల ఖర్చుల కోసం చేసేదేమీ లేక నష్టానికి అమ్ముకోవాల్సి వచ్చింది. పెట్టుబడి కూడా రావట్లేదు.

క్వింటాలుకు రూ.10వేల మద్దతు ధర ఉండాలి

కాకి రామయ్య, చిరుమర్రి, ముదిగొండ మండలం



మార్కెట్‌లో పత్తికి కనీసం క్వింటాలు రూ.10వేల మద్దతు ధర ఉంటేనే రైతులకు ప్రయోజనం. ఎకరానికి రూ.50వేలు పెట్టుబడి ఖర్చులు అయ్యాయి. దిగుబడి మాత్రం భారీగా పడిపోయింది. మద్దతు ధర రూ.7,521 కూడా దక్కడం లేదు. ప్రభుత్వం ధరలు పడిపోకుండా చర్యలు తీసుకోవాలి.

రైతు సంక్షేమమే ప్రభుత్వ సంకల్పం

(5వ పేజీ తరువాయి)

ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామన్నారు. పత్తి పంట సాగు చేసిన రైతులకు ఉమ్మడిజిల్లాలో 9 సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటుచేసినట్టు రైతులు తీసుకువచ్చిన పత్తిలో కోత విధిస్తే సహించబోమని, వేబ్రిడ్జికాటాల్లో తేడా వస్తే మిల్లు సీజ్‌చేస్తామన్నారు. తిరుమలాయపాలెం ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో మండలవ్యాప్తంగా 157మంది విద్యార్థినులకు పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా సైకిళ్లు పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని 4 మండలాల్లో రూ.2లక్షల చొప్పున 8 లక్షలతో సైన్సుల్యాబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో కూడా స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు ఆర్వోప్లాంట్లను పీఎస్ఆర్ ట్రస్టు ద్వారా ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ మువ్వా విజయ్‌బాబు అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ నాయకులు తుళ్లూరి బ్రహ్మయ్య. రామసహాయం నరేష్‌రెడ్డి, చావా శివరామకృష్ణ, ఇరిగేషన్ ఈఈ వెంకటేశ్వర్లు, డీఈ రమేష్‌రెడ్డి, డీఈవో సోమశేఖశర్మ, తహసీల్దార్ పీవీ రామకృష్ణ, ఎంపీడీవో సిలార్‌సాహెబ్, మద్దులపల్లి ఏఎంసీ ఛైర్మన్ హరినాథబాబు, వైస్‌ఛైర్మన్ నరేందర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బెల్లం శ్రీను, మాజీ ఎంపీపీ బోడ మంగీలాల్ పాల్గొన్నారు.



తిరుమలాయపాలెంలో మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ప్రతిష్టాత్మకంగా ఇందిర డెయిరీ

(5వ పేజీ తరువాయి)

కలిపి బ్యాంకులో రూ.39లక్షలకు చేరిందని తెలిపారు. ఇందిర డెయిరీ ద్వారా సేకరించే పాలను అమ్మడం ద్వారా వచ్చే లాభమే కాకుండా, డెయిరీ పరిశ్రమ ద్వారా ఉత్పత్తి అయ్యే వెన్న, నెయ్యి, ఐస్‌క్రీం, చాక్లెట్లు వంటి ఇతర ఉత్పత్తులు వల్ల లభించే ఆదాయం సభ్యులకు చెందుతుందని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే తాను ఏర్పాటు చేసిన మొట్టమొదటి సమావేశం ఇందిర డెయిరీని పట్టాలు ఎక్కించేందుకేనని పేర్కొన్నారు. ఇప్పటికే ఐదు మండలాల్లో బల్క్ పాల సేకరణ కేంద్రాలు ఏర్పాటుకు స్థలాలు కేటాయించామని, ఎర్రుపాలెంలో నిర్మాణం పూర్తి చేసి దసరా రోజు ప్రారంభించామని, మిగతా మండలాల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఇందిర డెయిరీలో ఇప్పటివరకు 61వేల మంది సభ్యులుగా చేరారని, తొలి విడతలో 20వేల మందికి సబ్సిడీపై ఒక్కొక్కరికి రెండు గేదెలు ఇవ్వటం జరుగుతుందని, రెండో విడతలో మరో 20వేల మందికి గేదెలు అందించడం జరుగుతుందని అన్నారు.

ప్రస్తుతం జిల్లాలో రోజుకు లక్ష లీటర్ల పాల ఉత్పత్తి జరుగుతోందని ఇందిర డెయిరీ ద్వారా ఇకపై రోజుకు సగటున లక్షా 20వేల లీటర్లు పాల ఉత్పత్తి జరగనుందని పేర్కొన్నారు. తద్వారా మహిళలు నెలకు రూ.25కోట్లు సంపాదించవచ్చని సంవత్సరానికి రూ.300కోట్లు ఆర్జించవచ్చని తెలిపారు. డెయిరీ ఉత్పత్తుల కేంద్రం పూర్తయితే మరో రూ.300కోట్లు కలిపి మొత్తం సంవత్సరానికి రూ.600కోట్లు మహిళలు ఆర్జించవచ్చని అప్పుడు దేశం మొత్తం చూపు మధిర ఇందిర డెయిరీ వైపు ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ముజిమ్మల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ ఛైర్మన్ రాయల నాగేశ్వరరావు ఇందిరా డైరీ ఛైర్మన్ అన్నపూర్ణ, సభ్యులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భట్టి విక్రమార్క

విద్యపై ప్రత్యేక శ్రద్ధ

- పాఠశాలల్లో రూ.2లక్షలతో ల్యాబ్ ఏర్పాటు
- స్కిల్ యూనివర్సిటీ బ్రాంచ్‌ను తీసుకువస్తా
- రెవెన్యూ, గృహనిర్మాణశాఖ మంత్రి పొంగులేటి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రప్రభుత్వం విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెడుతోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంరూరల్ మండలం, గోళ్లపాడు, పోలేపల్లి గ్రామాల్లోని ప్రభుత్వపాఠశాలలో చదువుతున్న బాలికలకు పీఎస్ఆర్ ట్రస్టు తరుపున మంగళవారం సైకిళ్ల పంపిణీ చేశారు. అనంతరం ఆరెకోడు, బారుగూడెం, తదితర గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వంతోపాటుగా తన సొంత నిధులు వెచ్చిస్తానని తెలిపారు. పాలేరులో వచ్చే ఏడాది ప్రతి మండలానికి ఒక పాఠశాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికచేసి అందులో పూర్తిస్థాయిలో రూ.2లక్షల వ్యయంతో ల్యాబ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తామని దానికి నాలుగు మండలాల్లో రూ.8లక్షలు తన సొంత నిధులు అందజేస్తామన్నారు. మరుసటి ఏడాది ప్రతి పాఠశాలలో పూర్తిస్థాయిలో ల్యాబ్‌లు అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్నటువంటి స్కిల్ యూనివర్సిటీ బ్రాంచిని పాలేరు నియోజకవర్గంలో ఏర్పాటు చేయనున్నట్టు తెలిపారు. విద్యార్థినులకు సైకిళ్ల పంపిణీ ప్రతీ ఏడాది పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. మంత్రి సమక్షంలో వివిధ పార్టీలకు చెందిన పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి కాంగ్రెస్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి, విద్యాశాఖ అధికారి సోమశేఖరశర్మ, మద్దులపల్లి మార్కెట్ ఛైర్మన్ హరినాథబాబు, తహసీల్దార్ రాంప్రసాద్, జిల్లా నాయకులు మద్దినేని స్వర్ణకుమారి, స్థానిక నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

హోరా హోరీగా కబడ్డీ పోటీలు

- కొత్తగూడెంలో రెండో రోజు 32వ లీగ్ అండ్ నాకౌట్ మ్యాచ్‌లు
- నేడు క్రీడల ముగింపు



టాస్ వేస్తున్న ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో సీఎస్ఆర్ ట్రస్ట్ - భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న రాష్ట్ర స్థాయి కబడ్డీ ఇన్విటేషన్ పోటీలను 2వ రోజు ఇల్లెందు ఎమ్మెల్యే కోరంకనకయ్య టాస్ వేసి మంగళవారం ప్రారంభించారు. ఫ్లడ్‌లైట్ల వెలుగులో సింథటిక్ మ్యాట్‌పై 32 మ్యాచ్‌లు హోరా హోరీగా జరిగాయి. వాటిలో 12 సూపర్ లీగ్ మ్యాచ్‌లు మహిళా జట్టకు జరుగగా, 20 లీగ్ అండ్ నాకౌట్ జట్లకు పురుషులకు నిర్వహించారు. మ్యాచ్ అనంతరం క్రీడాకారులకు ఫైర్ క్యాంపును ఏర్పాటు చేశారు. వైదికపై నిర్వాహకులు ఉమ్మడి ఖమ్మం జిల్లా కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ క్రిష్టాఫర్‌ను ఘనంగా సత్కరించారు. చివరి రోజైన బుధవారం ముగింపు వేడుకలకు తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి హాజరై బహుమతులు అందజేయనున్నారు. నేడు 3వ రోజు సెమీస్ తో పాటు ఫైనల్ మ్యాచ్‌లు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రకటించారు.

మహిళా జట్లు....

- వరంగల్ - ఖమ్మం మధ్య జరిగిన మ్యాచ్‌లో 21 పాయింట్‌ల తేడాతో ఖమ్మం గెలుపు.
- హైదరాబాద్ - నల్గొండ మధ్య జరిగిన మ్యాచ్‌లో 27 పాయింట్‌ల తేడాతో నల్గొండ గెలుపు
- మెదక్ - ఖమ్మం మధ్య జరిగిన మ్యాచ్‌లో 32 పాయింట్‌ల తేడాతో ఖమ్మం గెలుపు
- ఖమ్మం - హైదరాబాద్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 28 పాయింట్‌ల తేడాతో ఖమ్మం గెలుపు

పురుషుల జట్లు...

ఖమ్మం - హైదారాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 11 పాయింట్‌ల తేడాతో ఖమ్మం గెలుపు

- ఖమ్మం - కరీంనగర్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 4 పాయింట్‌ల తేడాతో కరీంనగర్ గెలుపు
- మెదక్ - ఖమ్మం జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో 13 పాయింట్‌ల తేడాతో ఖమ్మం గెలుపు
- వరంగల్ - నిజామాబాద్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో18 పాయింట్‌ల తేడాతో వరంగల్ జట్టు గెలుపొందింది.

లంచగొండుల ఆటకట్టు

(5వ పేజీ తరువాయి)

జీతాలు చెల్లించేందుకు రూ.15లక్షలు లంచం ఇవ్వాలని కళాశాల ఏవో, జూనియర్ అసిస్టెంట్ డిమాండ్ చేశారు. చర్చల అనంతరం అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ రూ.7లక్షలకు ఒప్పందం కుదుర్చుకుంది. తొలివిడతగా రూ.3లక్షలు ఇస్తామని, నవంబరు 2న మరో రూ.4లక్షలు చెల్లిస్తామని మాట్లాడుకున్నారు. అయితే లంచం ఇవ్వడం ఇష్టంలేని ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ యాజమాన్యం ఏసీబీని ఆశ్రయించింది. దీంతో ఏసీబీ అధికారులు అన్ని వివరాలు సేకరించిన తర్వాత పక్కా స్కెచ్ వేశారు. మంగళవారం మెడికల్ కళాశాల ఆవరణలో రూ.3లక్షలు అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ వారు మెడికల్ కళాశాల ఏవో ఖలీలుల్లా, జూనియర్ అసిస్టెంట్ సుధాకర్‌లకు ఇస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వారి నుంచి నోట్ల కట్టలను స్వాధీనం చేసుకొని ఏవో, జూనియర్ అసిస్టెంట్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఏసీబీ డీఎస్పీ వై. రమేష్ తెలిపారు.

త్వరలో అశ్వారావుపేటకు .. మునిసిపల్ హోదా?

ఎప్పటి నుంచో ఎదురుచూస్తున్న అశ్వారావుపేట వాసుల కల నెరవేరనుంది. అశ్వారావుపేట , పేరాయిగూడెం, గుర్రాల చెరువు గ్రామపంచాయతీలు కలిసి మున్సిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే అనుమతులకు అవసరమైన ప్రతిపాదనలు జిల్లా కలెక్టర్ అనుమతులు పొంది పురపాలక పట్టణాభివృద్ధి సంస్థ కమిషనర్ కార్యాలయంలో అనుమతులకోసం వేచి ఉంది. ఎమ్మెల్యే జారే ఆదినారాయణ కూడా అశ్వారావుపేటను మునిసిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు ఆయన వంతు ప్రయత్నాలు చేస్తుండటంతో అశ్వారావుపేట మునిసిపాలిటీ అవతరించడం లాంఛనమేనని చెప్పవచ్చు. అశ్వారావుపేట నియోజకవర్గ కేంద్రం కావడం, పూర్వపు బ్లాక్ కేంద్రంగా ఉండటం కూడ దీనికి అనుకూలాంశంగా చెప్పవచ్చు.


అశ్వారావుపేట పట్టణం

- పురపాలక, పట్టణ శాఖ కార్యాలయ ఆమోదం లాంఛనమే..
- నియోజకవర్గ కేంద్రం, పూర్వపు బ్లాక్ కేంద్రం కావడం అనుకూల అంశాలు
- అశ్వారావుపేట, పేరాయిగూడెం, గుర్రాలచెరువు పంచాయతీలు విలీనం
- త్వరలోనే తుది అనుమతుల నేపథ్యంలో అధికారుల బృందం పర్యటన

అశ్వారావుపేట, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మేజర్ పంచాయతీ, గుర్రాలచెరువు, పేరాయిగూడెం గ్రామ పంచాయతీలను విలీనం చేయడం ద్వారా అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే ఆయా పంచాయతీల నుంచి అభ్యంతరం లేనట్టు అనుమతిస్తూ కలెక్టర్‌కు లేఖలు వెళ్లాయి. జిల్లా కలెక్టర్ కార్యాలయం నుంచి పురపాలక, పట్టణ శాఖ కమిషనర్ అనుమతుల కోసం వేచి ఉంది. మూడు పంచాయతీలలో 32వేలకు పైగ జనాభా ఉంది. ఈ మేరకు ఇప్పటికే డీపీఆర్‌లు సిద్ధం చేశారు.

త్వరలోనే విజిలెన్స్ పర్యటన..

మూడు పంచాయతీలను విలీనం చేయడం ద్వారా అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు డీపీఆర్‌లు పంపడం, త్వరలోనే కార్యరూపం దాల్చేఅవకాశాలున్న నేపథ్యంలో విజిలెన్స్, ఇతర సంబంధిత అధికారుల బృందాలు పర్యటించి పూర్తి నివేదికలు తయారు చేసి ప్రభుత్వానికి పంపుతారు. ప్రతిపాదిత పంచాయతీలలో జనాభా, ఓటర్లు, ఆదాయ వ్యయాలు, భౌతిక వనరులు, పన్నులు, ఇతర అంశాలన్నింటిపైన అధికారుల బృందం సర్వే చేసే అవకాశం ఉంది.

● అశ్వారావుపేట మేజర్ పంచాయతీ వివరాలు: అశ్వారావుపేట మేజర్ గ్రామ పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 13,304 మంది జనాభా ఉండగ ప్రస్తుతం 22,336 మంది జనాభా కలిగి ఉంది. గడచిన మూడేళ్ల సరాసరి ఆదాయం రూ.8.38కోట్లు, వ్యయం రూ.7.17కోట్లు ఉంది.

● పేరాయిడెం గ్రామ పంచాయతీ: పేరాయిగూడెం పంచాయతీ వేరేగ ఉన్నప్పటికి భౌతికంగా అశ్వారావుపేట పట్టణంలోనే కలసి ఉంటుంది. పేరాయిగూడెం పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 5,947 మంది ఉండగా, ప్రస్తుతం 8,082 మంది జనాభా ఉన్నారు. ఆదాయం మూడేళ్ల సరాసరి రూ.3.10కోట్లు ఉండగా, వ్యయం రూ.2.82కోట్లుగా ఉంది.

● గుర్రాలచెరువు పంచాయతీలో 2011 జనాభా లెక్కల ప్రకారం 896 మంది జనాభా ఉండగా, ప్రస్తుతం 1,248 జనాభా ఉన్నారు. ఆదాయం రూ.58 లక్షలు, వ్యయం రూ.52లక్షలుగా ఉంది.

మారనున్న రూపురేఖలు

అశ్వారావుపేట మునిసిపాలిటీగా మారితే పట్టణ రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ఇటు సామాజికంగా, అభివృద్ధి, భౌతిక పరిస్థితితో పాటు రాజ్యాకీయ ముఖచిత్రం కూడా పూర్తిగా మారిపోయే అవకాశాలున్నాయి.. మునిసిపాలిటీగా అవతరిస్తే తమకు అవకాశం కలుగుతుందనే భావనలో అనేక మంది ఆశావాహులు ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. వచ్చే ఎన్నికలు మునిసిపాలిటీగా జరిగే అవకాశాలున్నట్టు తెలుస్తోంది.



త్వరలోనే మునిసిపాలిటీ..

ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

అశ్వారావుపేట మునిసిపాలిటీగా ఏర్పాటు చేసేందుకు అవసరమైన ప్రతిపాదనలన్నింటినీ ఇప్పటికే అధికారులకు పంపించాం. త్వరలోనే ఇది సాకారమవుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. వచ్చే ఎన్నికలు మునిసిపాలిటీ ఎన్నికలే జరుగుతాయని భావిస్తున్నాం.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఖమ్మం విద్యార్థులు


చరిత శ్రీ


గౌతమ్

ఖమ్మం ఖానాపురం హవేలీ/ ఖమ్మం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఖమ్మం నుంచి ఇద్దరు విద్యార్థులు ఎంపిక య్యారు. ఖమ్మం రూరల్ మండల పరిధిలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన మాదరబోయిన చరిత శ్రీ అనే విద్యార్థిని అండర్-14 రాష్ట్ర స్థాయి షటిల్ పోటీలకు అర్హత సాధించినట్లు కోచ్ యండపల్లి హరీష్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర కబడ్డీ పోటీలకు వెళ్లే ఖమ్మం జిల్లా జట్టుకు నగరంలోని నయాబజార్ ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి బి. గౌతమ్ ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రామారావు తెలిపారు.

ఓపెన్ హౌజ్‌తో ఆయుధాలపై అవగాహన


పోలీసుల ఆయుధాల గురించి వివరిస్తున్న ఏడీసీపీ నరేష్‌కుమార్

ఖమ్మంక్రైం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పోలీసుల అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మంగళవారం నగరంలోని పోలీసు హెడ్‌క్వార్టర్స్‌లో 'ఆన్‌లైన్ ఓపెన్‌హౌజ్' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విద్యార్థులు అధికంగా హాజరై తిలకించారు. ఈసందర్భంగా అడిషనల్ డీసీపీ అడ్మిన్ నరేష్‌కుమార్ పోలీసు ఆయుధాల గురించి విద్యార్థులకు వివరించారు. అనంతరం అసాంఘిక, సంఘవిద్రోహక శక్తులు గుమికూడా అల్లర్లకు పాల్పడే సందర్భంలో నివారించేందుకు ఉపయోగించే వివిధ అత్యాధునిక ఆయుధాలు, వాటి పనితీరు, టియర్‌గ్యాస్ షెల్, వైర్‌లెస్‌సెట్స్, బాడీఓన్ కెమేరాలు, బాంబుడిస్పోజల్ సిబ్బంది ఉపయోగించే పరికరాలు, సైబర్ నేరాలను పసిగట్టే విధానాలు తదితరాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. నేరస్థులను, బాంబులను గుర్తించడం, క్రమశిక్షణతో డాగ్ హ్యాండలర్స్ ఆదేశాలు పాటించే తీరు ఆకర్షించాయి. ఈకార్యక్రమంలో ఆర్ఐ కామరాజు, ఐటీ కోర్ టీం ఎస్ఐ సత్యనారాయణ పాల్గొన్నారు.


క్రీడాకారులను అభినందిస్తున్న సీఈ ప్రభాకరరావు

జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ టోర్నీలో కేటీపీఎస్ సత్తా

పాల్వంచ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): జూరాలలో ఈ నెల 24 నుంచి 26వ తేదీ వరకు నిర్వహించిన జెన్కో ఇంటర్ ప్రాజెక్ట్ కల్చరల్, క్యారమ్స్ టోర్నమెంట్లో కేటీపీఎస్ 5,6 దశల క్రీడాకారులు తమ సత్తా చాటారు. టోర్నమెంట్లో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు మంగళవారం సీఈ ప్రభాకరరావు తన చాంబర్‌లో జ్ఞాపికలను అందజేసి అభినందించారు. క్యారమ్స్‌లో రన్నర్‌గా నిలవడమే కాక కల్చరల్ గ్రూప్ డ్రామాలో తృతీయ బహుమతి సాధించడం పట్ల హర్షం వ్యక్తం చేసారు. విచిత్ర వేషధారణలో ద్వితీయ బహుమతి, బెస్ట్ ఎంటర్‌టైనర్ అవార్డులను దక్కించుకున్న క్రీడాకారులను అభినందించారు. భవిష్యత్తులోనూ మరిన్ని విజయాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈలు ధర్మారావు, సత్యనారాయణ, స్పోర్ట్స్ సెక్రెటరీ వీరాస్వామి, కల్చరల్ టీం సభ్యులు వీరమోహన్‌రావు, మసూద్, రమేష్, కృష్ణ, రాములు, శ్రీను, సునీల్‌రెడ్డి, శారద, చంద్రశేఖర్, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ వారోత్సవాలు ప్రారంభం


జ్యోతి ప్రజ్వళన చేస్తున్న నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ వారోత్సవాలు కొత్తగూడెం సర్వజన ఆసుపత్రిలో మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ వారోత్సవాలను ప్రభుత్వ న ర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ జ్యోతి జ్యోతిప్రజ్వళన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా మహిళలు తీసుకోవాలని సూచించారు.

ఐఎంఏ రాష్ట్ర అధ్యక్షుడిగా విజయ్‌కుమార్



కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా కొత్తగూడెం పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వి.విజయ్ కుమార్ నియమితులయ్యారు. మంగళవారం కొత్తగూడెం క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన డాక్టర్ విజయ్‌కుమార్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న వైద్యుల సమస్యలపై నిర్విరామంగా పోరాటాలు చేసి పరిష్కరించుకుంటామని స్పష్టం చేశారు. రాష్ట్ర ఐఎంఏ చరిత్రలోనే అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికవడం జీవితంలో మరిచిపోని సంఘటనగా నిలిచిపోతుందన్నారు. గత 30 సంవత్సరాలుగా తాను అందించిన సేవలకు ఈ పదవి దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో పలు సామాజిక సేవా కార్యక్రమాలను చేపడతామని ఐఎంఏ వైద్యులకు అండగా నిలుస్తుందని హామీ ఇచ్చారు. రాష్ట్ర కమిటీలోకి కొత్తగూడెం నుంచే డాక్టర్ అరికెల భాస్కర్‌రావును నియమించినట్లు ప్రకటించారు. ఈ సమావేశంలో భద్రాద్రి జిల్లా ఐఎంఏ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ రంగారావు, డాక్టర్ అయ్యప్ప రాజశేఖర్, ట్రెజరర్ ప్రవీణ్‌కుమార్, ప్రముఖ వైద్యులు డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ కనకరాజు పాల్గొన్నారు.

భూ నిర్వాసితులకు ఎకరానికి రూ. 13.50లక్షల పరిహారం

- స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ కాశయ్య
- ఎకరానికి రూ. 25లక్షలు చెల్లించాలని రైతుల డిమాండ్


పరిహారాన్ని పెంచాలని డిప్యూటీ కలెక్టర్ కాశయ్యను కోరుతున్న రైతులు

జూలూరుపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): సీతారామ 18ఎల్ లింక్ కెనాల్ నిర్మాణంతో భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం ఎకరానికి రూ. 13.50లక్షల పరిహారాన్ని అందిస్తున్నట్లు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ జె.కాశయ్య తెలిపారు. మంగళవారం జూలూరుపాడులోని పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా భూనిర్వాసితులకు ప్రభుత్వం ప్రకటించిన పరిహార వివరాలను తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూలూరుపాడు మండలం వినోభానగర్ నుంచి ఏన్కూర్ వరకు సీతారామ లింక్‌కెనాల్ నిర్మాణాన్ని ప్రభుత్వం చేపడుతుందన్నారు. జూలూరుపాడు మండలంలో పాపకొల్లు, జూలూరుపాడు రెవెన్యూ పరిధిలో 31మంది రైతులు లింక్ కెనాల్ నిర్మాణంతో 29.14 కుంటల భూమిని కోల్పోయినట్లు తెలిపారు. ప్రభుత్వం ప్రకటించిన పరిహారం తమకు గిట్టుబాటుకాదని, అందరికి ఒకే విధంగా పరిహారాన్ని అందించకుండా భూముల విలువలను బట్టి పరిహారాన్ని మంజూరు చేయాలని రైతులు కోరారు. భూముల సేకరణ సమయంలో తమకు ఎకరానికి రూ. 20లక్షల పరిహారాన్ని అందిస్తామని పనులకు ఆటంకం కలిగించవద్దని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారని తెలిపారు. ఎకరానికి రూ. 13.50లక్షల పరిహారాన్ని ప్రభుత్వం చెల్లిస్తామని చెప్పటం తగదన్నారు. ఎకరానికి రూ. 25లక్షల పరిహారాన్ని ఇవ్వాలని లేకుంటే పనులను అడ్డుకుంటామని వారు తెలిపారు. ఈ గ్రామ సభలో సీతారామ డిఈ చంద్రశేఖర్, ఏఈ సాగర్, ఎఫ్ఆర్వో ప్రసాదరావు, ఆర్ఐ తిరపతిరావు, స్పెషల్ ఆర్ఐ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రైతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట

- ఉపముఖ్యమంత్రి భట్టి


సిరిపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించిన భట్టి

మధిరరూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో రైతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. సిరిపురం నుంచి మల్లారం మీదుగా రామచంద్రాపురం వరకు రూ.25కోట్లతో నిర్మించే డబుల్‌బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. సిరిపురం గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. ఈకళాశాల భవనం పూర్తిస్థాయి శిథిలావస్థకు చేరుకుందని కొత్త భవన నిర్మాణానికి నిధులు మంజూరుచేయంచాలని గ్రామస్థులు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దృష్టికి తీసుకెళ్లారు. మధిర మండలం ఖాజీపురం వద్దగల మంజిత్‌కాటన్ జిన్నింగ్ మిల్లులో సీసీఐ పత్తికొనుగోలు కేంద్రాన్ని భట్టి ప్రారంభించారు ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు తాము పండించిన పత్తిని సీసీఐకి తీసుకువచ్చి మంచి ధరను పొందాలని సూచించారు. తెలంగాణలో గతంలో ఏ ప్రభుత్వం చేయని విధంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా ఉంటుందని రుణమాఫీ చేసి చూపించామన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, వ్యవసాయశాఖ ఏడీఏ విజయ్ చందర్ తహసీల్దార్ రాంబాబు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

భద్రాచలం నియోజకవర్గ సమస్యలు పరిష్కరించాలి

- సీఎం రేవంత్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే తెల్లం


సీఎంకు వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

భద్రాచలం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): భద్రాచలం నియోజకవర్గంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు వినతిపత్రం అందజేశారు. భద్రాచలం పట్టణాభివృద్ధికి నిధులు కేటాయించాలని, చర్ల, దుమ్ముగూడెం కేంద్రంగా పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, సీతమ్మసాగర్ బ్యారేజ్ పనులు త్వరగా పూర్తి చేయాలని కోరారు. భద్రాచలం ఏరియా వైద్యశాల పోస్టులు భర్తీ చేయాలని, ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలకు నిధులు మంజూరు చేయాలని, ఏజెన్సీలో గిరిజనులకు పోడు పట్టాలివ్వాలని తదితర సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రిని కోరారు. ఇటీవల అంతర్జాతీయస్థాయిలో పవర్ లిఫ్టింగ్ పోటీల్లో స్వర్ణ పతకాన్ని సాధించిన భద్రాచలం ఏజెన్సీకి చెందిన మోడెం వంశీని, కోచ్ రాంరెడ్డిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమాల్లో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఫారెస్ట్, పంచాయతీరాజ్ 'ఉపాధి'లో అక్రమాలు

- రూ.10,36,271 రికవరీ, జరిమానా రూ.1,39,000
- సామాజిక తనిఖీ ప్రజావేదికతో వెలుగులోకి..
- వివరాలు వెల్లడించిన డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శిరీష


మాట్లాడుతున్న అడిషనల్ పీడీ శిరీష

కామేపల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కామేపల్లి మండల పరిధిలోని 24గ్రామ పంచాయతీల్లో 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.5కోట్ల63లక్షల42వేల461 వ్యయంతో మహత్మాగాంధీ జాతీయ ఉపాధి హమీ పనులను చేపట్టారు. ఈ పనులను సామాజిక తనిఖీ బృందం తనిఖీ నిర్వహించారు. కామేపల్లిలో రెండు రోజులుగా ఎంపీడీవో అధ్యక్షతన సమావేశంలో నిర్వహించినట్లు తెలిపారు. డీఆర్‌డీఏ అడిషనల్ పీడీ శిరీష ప్రిసైడింగ్ అధికారిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అడిషనల్ పీడీ శిరీష ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

ప్రజావేదికలో డబల్ జాబ్‌కార్డులను, బినామీ పేర్లతో పనులు చేయడం, ప్రభుత్వ ఉద్యోగులు, రిటైర్డ్ ప్రభుత్వ ఉద్యోగులకు మస్టర్లు వేసినట్లు గుర్తించినట్లు తెలిపారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన అధికారులపై రూ.1,39,000 జరిమాన విధించినట్లు తెలిపారు. రూ.10,36,271 రికవరి చేసి సీఆర్‌డీఏ ఖాతాలో జమ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈజీఎస్ పనులకు సంబంధించి జరిమానా రూ.1,06,000, రూ.4,30,350 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు.

2020లో జరిగిన ఫారెస్ట్ పనుల్లో అవకతవకలు జరిగాయని, ఎంబీ రికార్డులు లేకుండానే పేమెంట్లు చేసినట్లు గుర్తించి అధికారులకు జరిమాన రూపంలో రూ.32,000, రూ.34,0275 రికవరీ చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ శాఖలో కూడా బాగానే అవినీతీ అక్రమాలు జరిగాయని గుర్తించారు. పనుల్లో వ్యత్యాసాలు ఉన్నాయని రూ.2,65,646 రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. అలాగే పాతలింగాల సీనియర్ మేట్ అల్లరి సంపత్ ఏడు రిజిస్టర్లు, మొక్కలు నిర్వహణ, రోజ్‌గార్ దివాస్, సర్వేయల్ రిపోర్టు నిర్వహణపై సంతృప్తి చెంది అభినందించారు. ఫీల్డ్ అసిస్టెంట్‌గా పీడీకి సిఫారసు చేయాలని ఎంపీడీవో రవీందర్‌కు ఆదేశించారు. ఈప్రజావేదికలో విజిలెన్స్ ఏఎంవీ పవన్, అంబుడ్స్‌మెన్ రమేష్, సూపరింటెండెంట్ వీవీఎస్ శాస్త్రి, క్యూసీ వీరయ్య, ఎస్టీఎం నరేంద్ర, ఎస్ఆర్‌పీ సాంబశివచారీ, ఏపీవో శ్రీరాణి, ఈసీ వెంకటేశ్వర్లు, డీఆర్‌పీలు, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న భట్టి

కలెక్టర్లతో భట్టి వీడియో కాన్ఫరెన్స్

మధిరటౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వచ్చే నెల 6నుంచి రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనున్న సమగ్ర కుటుంబ సర్వేపై మధిర పర్యటనలో ఉన్న ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క. మంగళవారం మధిరలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని వివిధ జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. ప్రభుత్వం ఉన్నతమైన ఆలోచనలతో చేపడుతున్న సర్వే ఎస్సీ, ఎస్టీ ఇతర బలహీన వర్గాల అభ్యున్నతి కోసం వివిధ సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ అవకాశలను మెరుగు పరుస్తుందని అన్నారు. సమగ్ర కుటుంబ సర్వేలో ప్రజల సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, కుల వివరాలను సంబంధించిన ఫార్మెట్‌లో ఏవిధంగా నింపాలో ఎన్యూమరేటర్లు, సూపర్ వైజర్లు, సిబ్బందికి తగు శిక్షణ ఇవ్వాలని అన్నారు. ఇంటింటి సర్వే పూర్తయిన వెంటనే సర్వే వివరాలు ఆన్‌లైన్ లో నమోదు చేసేలా డాటా ఎంట్రీ ఆపరేటర్లను సిద్ధంగా ఉంచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి మాట్లాడుతు జిల్లా సర్వే వివరాలు గోప్యంగా ఉంచాలని అన్నారు. ఏ ఒక్క ఇల్లు మిస్ కావొద్దని అవసరమైన సామాగ్రి సేకరించుకోవాలని తెలిపారు. మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతు సర్వే ప్రక్రియ చరిత్రలో నిలిచి పోవడమే కాకుండా దేశానికి రోల్ మోడల్ కానుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రులు జూపల్లి కృష్ణారావు, తుమ్మల నాగేశ్వరరావు, ఖమ్మం జిల్లా కలెక్టర్ ముజిమ్మల్ ఖాన్, అడిషనల్ కలెక్టర్ శ్రీజ తో పాటు వివిధ జిల్లాల కలెక్టర్లు పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

పాల్వంచ, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో వివాహిత ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాల్వంచ మండలంలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం మండల పరిధిలోని గంగదేవిగుప్ప గ్రామానికి చెందిన వాసం స్వప్న(28)కు రెండు సంవత్సరాల క్రితం కుక్కునూరు మండలానికి చెందిన వ్యక్తితో వివాహం జరిగింది. కానీ భార్యభర్తల మధ్య విబేధాలతో అప్పటి నుంచి కాపురానికి వెళ్లకుండా పుట్టింట్లోనే ఉంటుంది. కాగాతెల్లవారుజామున ఊరి పొలిమేరకు వెళ్లి పురుగమందు సేవించి ఆత్మహత్య చేసుకుంది. ఉదయం స్థానికులు గుర్తించి మృతదేహాన్ని ఇంటికి చేర్చి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రాథమిక విచారణ చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాల్వంచ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

పోస్టల్ ఉత్తరాలు రోడ్డుపై ప్రత్యక్షం


రోడ్డుపై పడిపోయిన ఉత్తరాలు

దుమ్ముగూడెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దుమ్ముగూడెం సబ్-పోస్టాఫీసు పరిఈట సీతారాంపురం బ్రాంచి పోస్టాఫీసు ద్వారా స్పీడ్ పోస్టులో డెలివరీ జరగాల్సిన ఉత్తరాలు మంగళవారం లక్ష్మీనగరం అంతర్గత రహదారిపై ప్రత్యక్షమయ్యాయి. వీటిలో రెండు పాన్ కార్డులు, మూడు ఎస్బీఐ ఏటీఎం కార్డులున్నాయి. గమనించిన కొందరు వ్యక్తులు రహదారిపై పడిన ఉత్తరాలను చూసి సమీప ఎస్బీఐ బ్యాంకులో అందజేశారు. డెలివరీ చేయాల్సిన సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడాన్ని పలువురు ఆక్షేపిస్తున్నారు.కాగా ఇటీవల కాలంలో దుమ్ముగూడెం సబ్-పోస్టాఫీసు పరిధిలోని కొన్ని బీఓల సిబ్బంది నిర్లక్ష్యపు పనితీరుపై పత్రికల్లో పలు ఆరోపణలు వచ్చాయి. తాజా సంఘటనతో మరో మారు బ్రాంచి ఆఫీసు సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ఎట్టకేలకు రోడ్డుపై పడిన ఉత్తరాలు దుమ్ముగూడెం ఎస్‌వోకు చేరాయి.

169 కిలోల బెల్లం, పట్టిక పట్టివేత


పట్టుబడిన బెల్లం, పట్టిక

జూలూరుపాడు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగన్నపాలెం గ్రామంలో ఓ కిరాణ దుకాణంలో కొత్తగూడెం ఎక్సైజ్ సిబ్బంది మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి నాటుసారా తయారీకి వినియోగించే బెల్లాన్ని పట్టుకున్నారు. హెడ్‌కానిస్టేబుల్ ప్రకాశ్ తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. మండలంలోని తవిసిగుట్టకు చెందిన బోడా బాలు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంపై 10కిలోల బెల్లం, కిలో పట్టికను తీసుకువెళుతుండగా సాయిరాంతండా గ్రామ సమీపంలో పట్టుకుని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సదరు వ్యక్తిని విచారించగా వెంగన్నపాలెం గ్రామంలోని పాపకొల్లు క్రాస్‌రోడ్డు సమీపంలోని ఎం.మణికంఠ కిరాణ వ్యాపారి వద్ద కొనుగోలు చేసినట్లు తెలిపారు. దీంతో సదరు వ్యాపారి దుకాణంలో దాడులు నిర్వహించగా నాటు సారా తయారీకి వినియోగించే 169కిలోల ఎర్రబెల్లం, 21కిలోల పట్టికను స్వాధీనం చేసుకున్నమన్నారు. పట్టుబడిన బెల్లం, పట్టిక విలువ రూ. 10,800లు ఉంటుందని తెలిపారు. ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రైతుబజార్ కూరగాయల ధరలు

(కిలో ఒక్కంటికి రూపాయల్లో)

టమాటా	38రూ.
వంకాయ	64
గుత్తి వంకాయ	70
బీరకాయ	64
పచ్చిమిర్చి	58
కాకరకాయ	48
బెండకాయ	58
పొట్లకాయ	58
దోసకాయ	56-70
గోరుచిక్కుడు	78
క్యాబేజీ	34
దొండ	48-58
సొరకాయ	40
క్యారెట్	58
క్యాప్సికం	88
ఆలుగడ్డ	40
ఉల్లిగడ్డ	50-60
కోడిగుడ్ల ట్రే (30 గుడ్లు)	165
కొత్తిమీర కట్ట	40

- ఆంధ్రజ్యోతి, ఖమ్మం మార్కెట్

సినిమా

CINEMA

నగరంలో చిత్రాలు..

వినోద:	వెనమ్
శ్రీనివాస:	లగ్గం, వెట్టయాన్
సాయిరాం:	విశ్వం
కేపీఎస్:	వెనమ్
తిరుమల:	దేవర

హలో ఆర్టీసీ

ఖమ్మం కొత్త బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225979
కార్గోసేవల నెంబరు: 9154298589

ఖమ్మం పాతబస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225958
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225965
కార్గోసేవల నెంబరు: 9704345599

సత్తుపల్లి బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225962
బస్టాండ్ ఎంక్వయిరీ: 9959225990
కార్గోసేవల నెంబరు: 9154298595

మధిర బస్టాండ్

డిపో మేనేజర్ల నెంబర్లు: 9959225961
బస్టాండ్ ఎంక్వయిరీ: 7382925289
కార్గోసేవల నెంబరు: 8143765370




సారథీనగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి, నిరుపయోగంగా ఉన్న వీధి వ్యాపారుల ప్రాంగణం

కలగానే రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం

- నిరుపయోగంగా వీధివ్యాపారుల ప్రాంగణం
- ఆధునికీకరణ జరగని గోళ్లపాడు ఛానెల్
- సమస్యలకు నిలయంగా 46వ డివిజన్..

డివిజన్ విజిట్

డివిజన్ స్వరూపం

విస్తీర్ణం: 2.5కిలోమీటర్లు
డివిజన్ జనాభా: 7000, ఓటర్లు:4600
డివిజన్ ప్రాంతాలు: జూబ్లీపుర, సారథినగర్, కాల్వొడ్డు, ట్రంక్‌రోడ్

ఖమ్మంటౌన్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): నగరంలోని 46వ డివిజన్ సమస్యలకు నిలయంగా మారింది. ముఖ్యంగా సారథినగర్ రైల్వే అండర్ బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురాకపోవటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన వీధి వ్యాపారుల ప్రాంగణం నిరుపయోగంగా ఉంది. రహదారులు, డ్రెయినేజీల సమస్యలు యధాతధమే. ముఖ్యంగా అంతర్గత రహదారుల పరిస్థితి అధ్వానంగా ఉంది. ప్రమాదకరంగా ఉన్న విద్యుత్‌స్తంభాలను సైతం తొలగించటం లేదు.

డివిజన్‌లోని సమస్యలివీ

డివిజన్ పరిధిలోని సారథినగర్ రైల్వే అండర్‌బ్రిడ్జి (ఆర్‌యూబీ) ప్రధాన సమస్యగా ఉంది. సదరు బ్రిడ్జిని వినియోగంలోకి తీసుకురాకపోవటంతో ప్రజల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏళ్ల తరబడి ఈ సమస్య ఇలాగే ఉంది. పెద్దకాలువకు వెళ్లే డ్రెయినేజీ నీరు పెద్దఎత్తున నిలిచిపోవటంతో ఆర్‌యూబీ నిర్మాణం పూర్తిచేసి వినియోగంలోకి తేవటంలో తీవ్రజాప్యం జరుగుతోంది. గతంలో నగరపాలకసంస్థ నుంచి సుమారు రూ.3కోట్లు బ్రిడ్జి నిర్మాణానికి కేటాయించారు. ప్రస్తుతం మరో రూ.2లక్షలు కేటాయించారు. కాగా స్వర్ణభారతి కళ్యాణమండపం నుంచి సారథినగర్ వరకు ప్రధాన రహదారి ధ్వంసం కావటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. గోళ్లపాడు ఛానెల్ ఈ డివిజన్‌లోనే ఉండగా, మిగతాప్రాంతంలో సుందరీకరణ జరిగి డివిజన్‌లోని ప్రాంతాన్ని వదిలేశారు. కేవలం గోడలు నిర్మించారు. పైన కప్పులు ఏర్పాటు చేయలేదు. కాగా గోళ్లపాడు ఛానెల్ ఉన్న ప్రాంతంలో పిచ్చిచెట్లు పెరిగాయి. ఇటీవల మున్నేరు వరదలకు డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో డ్రెయినేజీలు ధ్వంసం అయ్యాయి. పలుచోట్ల రహదారులు గుంతలుగా మారాయి. కాగా డివిజన్ పరిధిలో రూ.2కోట్లతో వీధివ్యాపారుల ప్రాంగణం నిర్మించి, వ్యాపారులకు కేటాయించకపోవటంతో నిరుపయోగంగా మారింది. డివిజన్‌లో రెండున్నర ఏళ్లలో రూ.4 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులు చేపట్టారు. రూ.15లక్షలతో కల్వర్టుల నిర్మాణం చేపట్టగా, సుమారు రూ.1.05 కోట్లతో డ్రెయినేజీ నిర్మాణాలు, రూ.2.80 కోట్లతో వీడీఎఫ్ సీసీ రహదారులు నిర్మించారు.

డ్రెయినేజీ నిర్మించాలి

మహమ్మద్ మస్తాన్



డివిజన్‌లో డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. పురాతనడ్రెయినేజీలు మురుగును పారించలేకపోతున్నాయి. ఇటీవల మున్నేరు వరదలకు పలు డ్రెయినేజీలు ధ్వంసం అయ్యాయి. కాగా డివిజన్‌లో అంతర్గత రహదారులు నడిచేందుకు వీలులేకుండా ఉన్నాయి. డ్రెయినేజీలతో పాటు అంతర్గత రహదారుల నిర్మాణాలు చేపట్టాలి. ప్రధాన రహదారుల్లో గుంతలకు మరమ్మతులు చేపట్టాలి.

కరెంట్ స్తంభాలతో భయం

ఎమ్మె రాంబాబు



డివిజన్‌లోని పలుప్రాంతాల్లోపురాతనమైన కరెంట్ స్తంభాలు కూలే స్థితిలో ఉన్నాయి. గాలి వస్తేనే ఊగుతున్నాయి. ఎప్పుడు ఏం ప్రమాదం జరుగుతుందోనని భయంగా ఉంది. అసంపూర్తిగా ఉన్న కాలువ నిర్మాణాలను పూర్తి చేయాలి. గోళ్లపాడు ఛానెల్‌కు నిర్మించిన గోడలపై శ్లాబ్ వేయలేదు. దీనివల్ల దుర్వాసన వస్తున్నది. రహదారికి సమానంగా ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి.

రూ.5కోట్లతో ప్రతిపాదనలు

కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్నకృష్ణ



డివిజన్‌లో రూ.5కోట్లతో అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు తయారుచేసి, అధికారులకు అందజేశాం. ముఖ్యంగా గోళ్లపాడు ఛానెల్‌కుపైన శ్లాబ్ వేయాల్సి ఉంది. అంతర్గత రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. వీధికుక్కల సమస్యను, వీధిదీపాలు వెలగడం లేదని ఎన్నిమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవటం లేదు. నిధులు మంజూరైతేనే అభివృద్ధి పనులు చేపడతాం.

ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు మానుకోవాలి

- జాతీయ మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ ప్రయత్నాలు వెంటనే మానుకోవాలని జాతీయ మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో భద్రాచలంనుంచి చేపట్టిన పాదయాత్ర మంగళవారం ఖమ్మం చేరుకుంది. ఈసందర్భంగా జడ్పీసెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాస్తవ పరిస్థితులు ఏమిటో తెలియకుండా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వర్గీకరణకు అనుకూలమంటా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించడం శోచనీయమన్నారు. ఓట్లు వేసి కాంగ్రెస్ పార్టీని గెలిపించిన మాలలకు అన్యాయం చేయడం తగదన్నారు.వర్గీకరణ ప్రయత్నాలు మానుకోకపోతే మాలల సత్తా ఏమిటో చూపిస్తామన్నారు. ఈ కార్యక్రమలో యనిటీ ఆఫ్ మాల జిల్లా అధ్యక్షుడు కందుల ఉపేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి అవుట మధు, వర్కింగ్ ప్రెసిడెంట్ జాగటి మధు, స్టీరింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్ టీజీ క్లైమెంట్, చిలకబత్తిని కనకయ్య, గులగట్టు యల్లయ్య, బందేల నాగలక్ష్మి, కామ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్‌కు మంత్రుల నివాళి

- అధికారికంగా మలీదు జగన్ అంత్యక్రియలు
- నివాళులు అర్పించిన మంత్రులు తుమ్మల, పొంగులేటి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 3వ డివిజన్ విషాదచాయలుఅలముకున్నాయి.కార్పొరేటర్ మలీదు జగన్ గుండెపోటుతో సోమవారం హైదరాబాద్‌లో మృతి చెందటం తెలిసిందే.. మంగళవారం భౌతికకాయాన్ని అతడి నివాసమైన బల్లేపల్లికి తరలించారు. ఎన్టీఆర్ సర్కిల్ నుంచి జగన్ నివాసం వరకు కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్లు ర్యాలీ నిర్వహించారు. జగన్ నివాసంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మేయర్ పునుకొల్లు నీరజ, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, కమిషనర్ అభిషేక్‌ఆగస్త్య, ఏఎంసీ మాజీ ఛైర్మన్ మానుకొండ రాధాకిషోర్, కార్పొరేటర్ కమర్తపు మురళీ, మలీదు వెంకటేశ్వర్లు, లకావత్ సైదులునాయక్, పల్లెబోయిన చంద్రం, కొప్పెర సరితాఉపేందర్, దుద్దుకూరి వెంకటేశ్వర్లు, పాలేపు విజయావెంకటరమణ, రఘునాథపాలెం సొసైటీ అధ్యక్షుడు తాతా రఘురాం, గుత్తా వెంకటేశ్వర్లు, మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి గోగినపల్లి వెంకటేశ్వరరావు, ఆవుల వెంకటేశ్వర్లు, ఆవుల అశోక్, సీవై. పుల్లయ్య, ఝాన్సీ, కే. శ్రీనివాస్ తదితరులు నివాళులు అర్పించారు. ఆయన సేవలను కొనియాడారు.



నివాళులు అర్పిస్తున్న మంత్రి తుమ్మల



నివాళులర్పిస్తున్న మంత్రి పొంగిలేటి

విజయవాడ-మధిర-నెమలి బస్సు సర్వీస్ నేటినుంచి

వైరా,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): బుధవారం నుంచి విజయవాడ- మధిర-నెమలి వయా వైరామీదుగా ఖమ్మానికి మధిర డిపో బస్సుసర్వీస్‌ను ప్రారంభిస్తున్నామని డిపో మేనేజర్ డి.శంకర్‌రావు తెలిపారు. విజయవాడలో ఉదయం ఆరుగంటలకు ప్రారంభమై, మధిరకు చేరుకొని అక్కడి నుంచి ఉదయం 8గంటలకు బయల్దేరుతుంది.

‘ఎస్‌బీఐటీ’లో యాంటీ నార్కోటిక్స్ సదస్సు

ఖమ్మం ఖానాపురంహవేలి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఎస్‌బీఐటీ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం యాంటీ నార్కోటిక్స్ అవగాహన సదస్సు నిర్వహించినట్లు కళాశాల ఛైర్మెన్ గుండాల కృష్ణ తెలిపారు. నార్కోటిక్ డీసీపీ మధుమోహన్‌రెడ్డి డ్రగ్స్ వాడకం వల్ల విలువైన జీవితాన్ని, ఉజ్వల భవిష్యత్‌ను కోల్పోతారన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ జీ ధాత్రీ, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

డయల్ యువర్ డీఎంకు సమస్యల వెల్లువ

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):ఖమ్మండిపో పరిధిలో మంగళవారం నిర్వహించిన డయల్ యువర్ డీఎం కార్యక్రమానికి ప్రయాణికుల నుంచి అనేక సమస్యలు వచ్చినట్లు డిపో మేనేజర్ దినేష్ తెలిపారు. ఇల్లెందు రూట్లో రఘునాథపాలెం, శాంతినగర్, బూడిదంపాడు బస్టాప్‌ల్లో ఎక్స్‌ప్రెస్ బస్సులను ఆపాలని కోరారు. ఖమ్మం గుంటూరు, ఖమ్మం తల్లాడ, కల్లూరు విజయవాడ, దానవాయిగుడెం, కామంచికల్, పాతర్లపాడు, చింతకానికి కొత్తగా బస్సులు నడపాలని ప్రయాణికులుకోరారు.ఉదయం సమయాల్లో ఖమ్మం తొర్రుర్ సర్వీస్‌లు పెంచాలని అధికంగా సమస్యలు వచ్చినట్లు డీఎం తెలిపారు.

విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి

ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యా. విద్యారంగ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, ఒక్కసారి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలని పీఆర్‌టీయు తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్ రెడ్డి అన్నారు.

పారిశుధ్య పనులు సక్రమంగా చేయకుంటే కఠిన చర్యలు



పనులు పరిశీలిస్తున్న షఫీఉల్లా

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్య కార్యక్రమాలు సక్రమంగా చేయకున్నా, వీధుల వెంట చెత్త కనిపించినా కఠినమైన చర్యలు తీసుకుంటామని అసిస్టెంట్ కమిషనర్ అహ్మద్ షఫీఉల్లా హెచ్చరించారు. మంగళవారం 43,44,50,51 డివిజన్లలో పారిశుధ్య పనులను అసిస్టెంట్ కమిషనర్ తనిఖీలు చేశారు. డ్రెయినేజీల నిర్వాహణ సరిగా లేక పోవటంతో జవాన్ లక్ష్మీనారాయణను అసిస్టెంట్ కమిషనర్ మందలించారు. గంటలోపుగా శుభ్రం చేయాలని ఆదేశించారు. పారిశుధ్య కార్మికులు కేటాయించిన సమయం మేరకు పని చేయాలని సూచించారు.

9వ డివిజన్‌లో స్వచ్ఛ దీపావళిపై అవగాహన

ఖమ్మంసంక్షేమ విభాగం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 9వ డివిజన్‌లో స్వచ్ఛదీపావళి, శుభదీపావళి కార్యక్రమంపై అవగాహన కల్పించారు. దీపావళికి ముందుగా నివాసాలు, పరిసరాలను స్వచ్ఛంగా ఉంచుకునేందుకు స్వచ్ఛ దీపావళి కార్యక్రమం చేపట్టాలని, దీపావళి తర్వాత టపాసుల కాల్చిన వ్యర్థాలను తొలగించటం శుభ్రం చేసుకోవటంపై కార్యక్రమాలు చేయాలని సూచించారు. స్థానిక పార్కులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రజలకు పారిశుధ్య జవాన్, కార్మికులు అవగాహన కల్పించారు.

37వడివిజన్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు

ఖమ్మంబైపాస్‌రోడ్,అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): నగరంలోని 37వ డివిజన్ 222,223 బూత్‌ల్లో బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి మారుతి వీరభద్రప్రసాద్ ఆధ్వర్యంలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సెల్‌ఫోన్ ద్వారా సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ కార్యక్రమంలో పసుమర్తి సంతోష్, గుర్రాల నాగేందర్, జనార్ధన్, ధర్మేందర్, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వ నమోదు చేయిస్తున్న మార్తి వీరభద్రప్రసాద్

రహదారుల ఆక్రమణపై కొరడా

- 25వ డివిజన్‌లో కేఎంసీ అధికారుల పర్యటన
- ప్రధాన వీధి 40అడుగులతో విస్తరణకు మార్కింగ్

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్




భవనాలకు మార్కింగ్ చేస్తున్న అధికారులు, ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన కథనం

ఖమ్మంసంక్షేమవిభాగం,అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని 25వ డివిజన్‌లో ప్రధాన రహదారుల విస్తరణకు అధికారులు ఉపక్రమించారు. ఈమేరకు కొలతలను కేఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు పరిశీలించారు. రహదారులను ఆక్రమించి నిర్మాణాలు జరిగిన భవనాలకు మార్కింగ్ చేశారు. ప్రధాన రహదారి నిబంధనల మేరకు 40 అడుగులు విస్తీరణం కలిగి ఉండాలి. కానీ రహదారికి ఇరువైపులా డ్రెయినేజీ నిర్మాణాలను చేశారు. ఈనెల 19న ‘ఆంధ్రజ్యోతి’లో ప్రచురితమైన‘ఇరుకు వీధులు.. ఆపై ఆక్రమణలు’ కథనంపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ ఆగస్త్య స్పందించారు. రహదారుల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీంతో మంగళవారం పట్టణ ప్రణాళిక అధికారి వసుంధర్ ఆధ్వర్యంలో ప్రధాన రహదారుల కొలతలను పరిశీలించారు. 40అడుగులు రహదారి విస్తీరణం మేరకు మార్కింగ్‌లు చేశారు. రహదారులు ఆక్రమించి నిర్మాణాలు చేస్తే చర్యలు తప్పవన్నారు.

‘రైతుల సమస్యలు పరిష్కరించాలి’

ఖమ్మంరూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని అఖిల భారత ప్రగతిశీల రైతు సంఘం రాష్ట్ర నాయకుడు గుర్రం అచ్చయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రూరల్ తహసీల్దార్ రాంప్రసాద్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రైతులు పండించిన అన్ని రకాల పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలన్నారు. సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు చేయాలని, రైతు భరోసాని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘ నాయకులు నాగేశ్వరరావు, కుర్ర వెంకన్న, దొండేటి సత్యం, అప్పారావు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలి

- జిల్లా నాయకుడు శివయ్య

కామేపల్లి, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ పార్టీ సభ్యత్వ నమోదుకు టీడీపీ శ్రేణులు కృషి చేయాలని టీడీపీ జిల్లా నాయకులు తోటకూరి శివయ్య అన్నారు. కొత్తలింగాలలో మంగళవారం టీడీపీ నాయకులతో ప్రత్యేక కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. తెలంగాణలో టీడీపీ పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని అన్నారు. రూ.100 చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారికి గతంలో రూ.2లక్షలు ఉన్న ప్రమాద బీమాను రూ.5లక్షలకు పెంచారని తెలిపారు. ప్రతి గ్రామంలో నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఇల్లెందు నియోజకవర్గ నాయకులు పుచ్చకాయల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ తుమ్మలపల్లి పెద్దవీరయ్య, కొమ్మిన్ని సత్యనారాయణ, తోటకేరి ఉపేందర్‌రావు, అజ్మీరా హరి, ఏపూరి వసంతరావు, పుచ్చకాయల రామక్రిష్ణ, దేవేందర్ తదితరులు ఉన్నారు.

యోగాలో విన్‌ఫీల్డ్ విద్యార్థికి ప్రథమ బహుమతి



ఖమ్మంఖానాపురంహవేలి అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఆదియోగి పరమేశ్వర యోగా ఫౌండేషన్ వారు సోమవారం హైద్రాబాద్‌లో నిర్వహించిన 3వరాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో నగరంలోని విన్‌ఫీల్డ్ పాఠశాలలో 4వ తరగతి చదువుతున్న జి.హేమంత్‌సాయి ప్రథమ బహుమతి సాధించాడు. ఈ మేరకు పాఠశాల డైరెక్టర్లు గద్దె పుల్లారావు, మన్నె కిషోర్‌కుమార్ ఈ వివరాలు వెల్లడించారు. మంగళవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని అభినందించారు.

సత్వరమే రుణమాఫీ అమలు చేయాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని

చింతకాని, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో హామీల్లో భాగంగా ప్రకటించిన రుణమాఫీ ప్రక్రియను సత్వరమే పూర్తిచేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో ని ర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు రుణమాఫీ, రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రేషన్‌కార్డుల తో సంబంధం లేకుం డా ప్రతిరైతుకు రుణమాఫీ చేయాలన్నారు. వానాకాలం పంటకాలం ముగిసిపోతుందని స త్వరమే రైతుబంధు రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, జిల్లాలో ము గ్గురు మంత్రులు ఉన్న పనులు వేగం పుంజుకోవడంలేదన్నారు. పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సర్యం చేస్తుందని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకు బీఆర్ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. బీజేపీ పాలనలో అభివృద్ధి దూరం అయిందని. నిరుద్యోగులకు ఉద్యోగాలు కరువైనవన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీని ప్రజలు తిప్పికొట్టాలని లేకపోతే దేశానికి ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు.కార్యక్రమంలో నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమే ష్, బొంతు రాంబాబు, చింతలచెరువు కోటేశ్వరరావు, బండి పద్మ, సామినేని రామారావు, మడిపల్లి గోపాలరావు, మందా సైదులు, మద్దాల ప్రభాకర్, పాపినేని రామనర్సయ్య, శీలం నరసింహరావు పాల్గొన్నారు.

మధిర నుంచి నెమలికి బస్సు సర్వీస్

మధిర/వైరా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మధిర డిపో బస్సును విజయవాడ నుంచి మధిరమీదుగా ఏపీలోని నెమలి పుణ్యక్షేత్రానికి బస్సు సర్వీసును ప్రారంభిస్తున్నట్లు డీఎం శంకర్‌రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 30తేదీ బుధవారం నుంచి బస్సు నడుస్తుందని తెలిపారు. ప్రతిరోజు బస్సు ఉదయం 6గంటలకు విజయవాడలో బయలుదేరి 8గంటలకు మధిర చేరుకుంటుంది. మధిర నుంచి పెనుగోలను, ఊటుకూరు మీదుగా నెమలికి ఉదయం9గంటలకు చేరుకుంటుంది. అక్కడ నుంచి ఖమ్మం వెళ్తుంది. ఖమ్మంలోఉదయం 10.15గటలకు బస్సు బయలుదేరుతుందని పేర్కొన్నారు. ఈ బస్సు సర్వీసును ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డీఎం కోరారు.

సత్వరమే రుణమాఫీ అమలు చేయాలి

» సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్



సమావేశంలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్

చింతకాని, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలో హామీల్లో భాగంగా ప్రకటించిన రుణమాఫీ ప్రక్రియను సత్వరమే పూర్తి చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని పొద్దుటూరు గ్రామంలో నిర్వహించిన పార్టీ మండల మహాసభలో ఆయన పాల్గొన్నారు. పార్టీ జెండా ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో రైతులు రుణమాఫీ, రైతుబంధు కోసం ఎదురుచూస్తున్నారన్నారు. రేషన్‌కార్డులతో సంబంధం లేకుండా ప్రతిరైతుకు రుణమాఫీ చేయాలన్నారు. వానాకాలం పంటకాలం ముగిసిపోతుందని సత్వరమే రైతుబంధు రైతుల ఖాతాల్లో జమచేయాలని కోరారు. సీతారామ ప్రాజెక్టు పనులు నత్తనడకన కొనసాగుతున్నాయని, జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్న పనులు వేగం పుంజుకోవడంలేదన్నారు. పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం తాత్సర్యం చేస్తుందని, రాష్ట్ర ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ పార్టీకు బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే పడుతుందన్నారు. బీజేపీ పాలనలో అభివృద్ధి దూరం అయిందని. నిరుద్యోగులకు ఉద్యోగాలు కరువైనవన్నారు. మతం పేరుతో రాజకీయాలు చేస్తున్న బీజేపీ పార్టీను ప్రజలు తిప్పికొట్టాలని లేకపోతే దేశానికి ప్రమాదం పొంచి ఉందని హెచ్చరించారు. కార్యక్రమంలో నున్నా నాగేశ్వరరావు, పొన్నం వెంకటేశ్వర్లు, బండి రమేష్, బొంతు రాంబాబు, చింతలచెరువు కోటేశ్వరరావు, బండి పద్మ, సామినేని రామారావు, మడిపల్లి గోపాలరావు, మందా సైదులు, మద్దాల ప్రభాకర్, పాపినేని రామనర్సయ్య, శీలం నరసింహరావు, షేక్ బషీరుద్దీన్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు విద్యార్థుల ఎంపిక

కారేపల్లి, అక్టోబరు29: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. మంగళవారం పాఠశాలలో ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబ్‌నగర్‌లో ఇటీవల జరిగిన కబడ్డీ పోటీలలో ప్రేమ్‌కుమార్, సోనియా, హైదరాబాదులో జరిగిన నెట్‌బాల్ క్రీడా పోటీల్లో నిక్షిత, దీప్తి, ఇతర క్రీడల్లో చరణ్, రాకేష్ యామిని, అభిలాష్, కుమార్, సాయి, త్రిశలు ఎంపికైనట్లు తెలిపారు.

కృష్ణాపురంలో అక్రమ కట్టడాల కూల్చివేత

మధిరరూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మండలంలోని కృష్ణాపురం గ్రామంలో మెయిన్ రోడ్డు పక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన దుకాణాలను మంగళవారం రెవెన్యూ, పంచాయతీరాజ్‌శాఖ అధికారులు సంయుక్త ధ్వర్యంలో కూల్చివేశారు. గ్రామ సెంటర్‌లో బుచ్చిరెడ్డిపాలెం వెళ్లే రహదారి ప్రారంభంలో రోడ్డుకు ఇరువైపులా నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలు నిర్మించి షెడ్డు వేసి షాపులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో స్థానికులు అధికారులకు పిర్యాదుచేయడంతో మధిర తహసీల్దార్ రాంబాబు ఆధ్వర్యంలో రెవెన్యూ పంచాయతీరాజ్ అధికారులు కలిసి ఎక్స్‌కవేటర్లతో అక్రమ కట్టడాలను కూల్చివేయించారు. అక్రమంగా రహదారులపై నిర్మాణాలు చేబడితే చర్యలు తీసకుంటామని హెచ్చరించారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రం అభివృద్ధి

» డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

బోనకల్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. మండలంలోని రావినూతల గ్రామంలో మంగళవారం రూ.26కోట్ల నిధులతో వేయనున్న రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేశారు. రావినూతల నుంచి చింతకాని మండలం పొద్దుటూరు వరకు 11 కిలోమీటర్ల మేరకు రోడ్డు వి స్తరణ పనులు చేపట్టనున్నారు. ముందుగా భట్టి రావినూతల సెంటర్లో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళర్పించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీజ, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరావు, ఆర్‌అండ్‌బీ ఈఈ తానేశ్వర్, ఆర్డీవో ఎల్. రాజేందర్ గౌడ్, తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీవో ఆర్. రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎర్రుపాలెం, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో బీటీ రోడ్డు నిర్మాణ పనులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మంగళవారం శంకస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ప్రజా ప్రభుత్వం అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. కాంగ్రెస్‌తోనే తెలంగాణ పునర్నిర్మాణం సాధ్యమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, తహసీల్దార్ ఉషా శారద, ఎంపీడీవో సురేందర్, డీసీసీబీ డైరెక్టర్ అయిలురి వెంకటేశ్వరరెడ్డి, మండల అధ్యక్షుడు వేమిరెడ్డి సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు బండారు నరసింహారావు, శీలం శ్రీనివాసరెడ్డి, అనుమోలు కృష్ణారావు, యరమల పూర్ణచంద్రారెడ్డి, మహిళా అధ్యక్షురాలు గంటా తిరుపతమ్మ, తదితరులున్నారు.



రావినూతలలో రోడ్డు విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

తెలంగాణలో టీడీపీకి పూర్వవైభవం తీసుకొస్తాం

» వాసిరెడ్డి రామనాథం



టీడీపీ సభ్యత్వ నమోదును ప్రారంభిస్తున్న వాసిరెడ్డి రామనాథం

మధిరరూరల్, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):తెలంగాణలో తెలుగుదేశం పార్టీకి పూర్వవైభవం తీసుకొస్తామని టీడీపీ ఖమ్మం పార్లమెంట్ అధ్యక్షుడు డాక్టర్ వాసిరెడ్డి రామనాథం అన్నారు. మంగళవరం మధిరలో టీడీపీ కార్యాలయంలో పార్టీసభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈకార్యక్రమంలో మల్లాది హనుమంతరావు, చెరుకూరి కృష్ణారావు, ,చేకూరు శేఖర్‌బాబు, వంగాల రామకోటి, దేవభక్తుని వెంకట్, శివ పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖ-పొలంబాట

పెనుబల్లి, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండలంలోని మండాలపాడులో రైతుల పొలాల్లో పొలంబాట కార్యక్రమాన్ని మండల విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈ భుజంగకుమార్ మాట్లాడుతూ రైతులు తమ మోటార్లకు కెపాసిటర్లను అమర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లంకపల్లి సెక్షన్ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

'ఎమ్మెల్సీ అభ్యర్థి నర్సిరెడ్డిని గెలిపించాలి'

సత్తుపల్లిరూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించుకోవాలని టీఎస్ యూటీఎఫ్ మండల మహాసభ పిలుపునిచ్చింది. సోమవారం రాత్రి సత్తుపల్లిలో జరిగిన సంఘం సమావేశంలో పలువురు పాల్గొని మాట్లాడారు. అనంతరం సత్తుపల్లి మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా చెరుకు శ్రీనివాసరావు, కొక్కెరగడ్డ వెంకటేశ్వరావుతో పాటు సభ్యులను ఎన్నుకున్నారు.

'పత్తి రైతులను ఆదుకోవాలి'



మాట్లాడుతున్న అర్జున్‌రావు

వైరా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పత్తి క్వింటా ఒక్కింటికి రూ.18,500ధర చెల్లించి రైతులను ఆదుకోవాలని సీపీఐఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకుడు కె.అర్జున్‌రావు డిమాండ్ చేశారు. మండలంలోని కొండకొడిమ గ్రామంలో మంగళవారం నిర్వహించిన మాస్‌లైన్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగుచేసిన పత్తి అధిక వర్షాలతో తీవ్రంగా దెబ్బతిన్నదన్నారు. ఇంతవరకు సీసీఐ కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. వెంటనే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బెజవాడ రాము, బండి ప్రసాద్, లాలమ్మ, మురళీ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

» ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి



సత్తుపల్లిలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మట్టా రాగమయి

సత్తుపల్లి, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి అన్నారు. ఐకేపీ ఆధ్వర్యంలో మండలంలో గంగారం, కాకర్లపల్లి గ్రామాలలో మంగళవారం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నాగేశ్వరరావు, ఏపీఎం కేవీ.సుబ్బారావు పాల్గొన్నారు.

వేంసూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): వేంసూరు మండలం చౌడవరం తండాలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే డాక్టర్ మట్టా రాగమయి ప్రారంభించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంఏ.రాజు, ఏవో రామ్మోహన్‌రావు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సీసీలు ప్రసాద్, నాగచెన్నారావు, భాస్కర్, నాయకులు కాసర చంద్రశేఖర్‌రెడ్డి, పుచ్చకాయల సోమిరెడ్డి, గడ్డం అంజిరెడ్డి, బొమ్మనబోయిన వెంకటేశ్వరరావు, ఒగ్గు కరుణాకర్‌రెడ్డి, ఎండీ.ఫైజుద్దీన్, పొట్లపల్లి భానుప్రకాష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

కల్లూరు, అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): మద్దతు ధరను పొందేలా రైతులు తమ ధాన్యాన్ని ప్రభుత్వం తరుపున ఏర్పాటు చేసిన కేంద్రాలకు తరలించాలని ఏఎంసీ చైర్మన్ భాగం నీరజదేవి అన్నారు. మంగళవారం కల్లూరు ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు బోబోలు లక్ష్మణరావు, తహసీల్దార్ సాంబశివుడు, ఏవో రూపా, ఐకేపీ ఏపీఎం వెంకటారామరావు, సీఈవో బీరవల్లి శ్రీనివాసరావు, నాయకులు పసుమర్తి చందర్‌రావు, భాగం ప్రభాకరచౌదరి, ఎస్కే బాజీ, తురాబలి, పోట్రు అర్జునరావు, పెద్దబోయిన శ్రీనివాసరావు, దామాల రాజు, ఏఎంసీ కార్యదర్శి పంతులు పాల్గొన్నారు.

విత్తన ఏజెంట్ల మాటలు నమ్మి మోసపోవద్దు: ఏడీఏ



మాట్లాడుతున్న ఏడీఏ కరుణశ్రీ

వైరా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విత్తన మొక్కజొన్న సాగుచేసే రైతులు ఆకంపెనీల ఏజంట్లు చూపే ప్రలోభాలకు లొంగి మోసపోవద్దని వైరా ఏడీఏ తుమ్మలపల్లి కరుణశ్రీ హెచ్చరించారు. వైరాలోని రైతువేదికలో మంగళవారం వైరా డివిజన్ స్థాయిలోని విత్తన మొక్కజొన్న కంపెనీల ఆర్గనైజర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. విత్తన ఆర్గనైజర్స్‌కు పలు సూచనలు, హెచ్చరికలు చేశారు. రైతులు ప్రలోభాలకు లొంగి మోసపోవద్దని, తాము సాగుచేస్తున్న విత్తన మొక్కజొన్న కంపెనీలతో విధిగా అగ్రిమెంట్ చేసుకోవాలని స్పష్టం చేశారు. వైరా, కొణిజర్ల, ఏన్కూరు, సింగరేణి మండలాల్లో విత్తన మొక్కజొన్న గత మూడు సంవత్సరాల నుంచి సాగుచేసిన రైతులకు ఆశించిన దిగుబడులు రాక నష్టపోయిన విషయాన్ని ఆమె గుర్తుచేశారు. ఎకరాకు 30నుంచి 40క్వింటాళ్ల దిగుబడి వస్తుందని విత్తన కంపెనీల ఏజెంట్లు ఆశచూపిస్తారని వాటిని నమ్మొద్దని స్పష్టం చేశారు. అందువలన విత్తన కంపెనీల ఏజెంట్లు కూడా రైతులను మోసం చేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో వైరా, కొణిజర్ల, ఏన్కూరు ఏవోలు మయాన్ మంజూఖాన్, డి.బాలాజీ, నర్సింహారావు, రైతులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌గా చింతకాని నల్లచెరువు

చింతకాని, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నల్లచెరువును పర్యాటక కేంద్రంగా (మినీ ట్యాంక్‌బండ్) అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అధికారులకు సూచించారు. ఆయన ఆదేశాల మేరకు మంగళవారం సంబంధిత అధికారులు, స్థానిక నాయకులు నల్లచెరువును పరిశీలించారు. చెరువు ఆయకట్టు, విస్తీర్ణం పరిశీలించారు. అంచనా విలువ సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని ఇరిగేషన్ ఏఈ సురేష్ తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో రామయ్య, డీటీ వీరభద్రునాయక్, ఆర్ఐ రఘు, సర్వేయర్ నవీన్, సొసైటీ డైరెక్టర్ కిలారు మనోహర్‌బాబు, మడిపల్లి భాస్కర్, రైతులు కిలారు బాబురావు, బండి సైదేశ్వరరావు, మల్లెల వెంకటేశ్వర్లు, మజీద్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వెట్టర్ల పంపిణీ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): మహబూబ్‌నగర్ జిల్లా పాలమూరు ప్రాంతం నుంచి వచ్చిన వలస కూలీలకు సుధా హెర్బల్ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వహకురాలు కొనకళ్ల సుధారాణి రగ్గులు, స్వెట్టర్లు మంగళవారం పంపిణీ చేశారు. వీరంతా మండలంలోని బుగ్గపాడు తదితర ప్రాంతాలలో సీతారామ ప్రాజెక్టులో వలస కూలీలుగా పనిచేస్తున్నారని, గుడారాలు వేసుకుని నిద్రిస్తున్న క్రమంలో చలి ఎక్కువగా ఉన్న నేపథ్యంలో రగ్గులతో పాటు చిన్నారులకు స్వెట్టర్లను ఉచితంగా అందించినట్లు సుధారాణి తెలిపారు.

ధాన్యం కొనుగోలుపై అవగాహన

పెనుబల్లి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, ఏఈవోలకు ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణపై పెనుబల్లి రైతువేదికలో మంగళవారం అధికారులు అవగాహన సదస్సు నిర్వహించారు. ఏవో ఏడీఎస్.ప్రసాదరాజు, తహసీల్దార్ గంటా ప్రతాప్ ధాన్యం కొనుగోలులో పాటించాల్సిన నియమాల గురించి వివరించారు. కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు పొందాలని సూచించారు. మండలంలోని ఐకేపీ, పీఏసీఎస్ సెంటర్ల ఇన్‌చార్జిలు, ఏఈవోలు పాల్గొన్నారు.

పసుమర్తికి సన్మానం

వైరా, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుడిగా ఎన్నికైన పసుమర్తి చంద్రరావును మంగళవారం వైరా ఆర్యవైశ్యసంఘం నాయకులు సన్మానించారు. కల్లూరులోని ఆయన ఇంట్లో చంద్రరావును కలిసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. మిట్టపల్లి నాగి, రాఘవరావు, గ్రంధి ప్రవీణ్, అనుమోలు భాస్కర్‌రావు, కొణతం రాజారావు, తాటికొండ రాము, మైలవరపు శ్రీనివాసరావు, బండారు కృష్ణారావు, రాయల నాగేశ్వరరావు, జనార్ధన్ పాల్గొన్నారు.

చిన్నకోరుకొండి పీఏసీఎస్‌కు అవార్డు

కల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల పరిధిలోని చిన్నకోరుకొండి ప్రాథమిక సహకార సంఘం రుణాల వసూళ్లలో ఈ ఏడాది 90శాతం లక్ష్యాన్ని అధికమించినందుకు గాను జిల్లా కేంద్ర సహకార బ్యాంకు వారు ఉత్తమ అవార్డును అందజేశారు. మంగళవారం స్థానిక కేంద్ర సహకార బ్రాంచ్ కార్యాలయంలో అభినందన సభ ఏర్పాటు చేశారు. పీఏసీఎస్ తరుపున చైర్మన్ చావా వెంకటేశ్వరరావు, వైస్ చైర్మన్ కనకరావు, సీఈవో సీహెచ్ వేలాద్రిలను బ్రాంచ్ తరుపున మేనేజర్ ఎన్. రాణి వారిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ అసిస్టెంట్ మేనేజర్ పుష్పా, సొసైటీ చైర్మన్లు పాలెపు రామారావు, దిరిశాల నరిసింహారావు, నర్వనేని అంజయ్య, బోబోలు లక్ష్మణరావు, సీఈఓలు ఎం. అంజయ్య, బీరవల్లి శ్రీనివాసరావు, డైరెక్టర్లు, రైతులు మందడపు మురళి, రమేష్‌రెడ్డి, మైసయ్య, యసకె ఖాదర్, తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్ చైర్మన్ వెంకటేశ్వరరావు, సీఈవో వేలాద్రికి అవార్డు అందజేస్తున్న బ్యాంకు మేనేజర్ రాణి